
APTEL/2008/28200

## కవితకు మళ్లీ నిరాశే

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : కవిత బెయిల్ ప్రాసెస్‌లో ఉందని వచ్చే వారంలో బెయిల్ వస్తుందని కేటీఆర్ అంచనాలు తలకిందులు అయ్యాయి. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయలేదు. సీబీఐ, ఈడీ వాదనలు విన్న తర్వాతనే నిర్ణయం ప్రకటిస్తామని వాటికి నోటీసులు జారీ చేసింది. మార్చి పదిహేనో తేదీ నుంచి జైల్లో ఉంటున్న ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం నిరాకరించింది. ఎమ్మెల్సీ కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 5 నెలలుగా కవిత జైల్లో ఉన్నారని.. ఓ ప్రజాప్రతినిధిగా, మహిళ అయిన కవితను ఇంకెంత కాలం జైల్లో ఉంచుతారు అంటూ రోహత్గీ దర్యాప్తు సంస్థల తీరును ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటికే మనీష్ సిసోడియా, కేజ్రీవాల్ బెయిల్ పొందా రని కవిత కూడా బెయిల్‌కు అర్హురాలేనన్నారు. కేసు పెట్టిన ఈడీ, సీబీఐలకు తాము నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ గవాయి చెప్పారు.



# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం

## మహిళలపై కామెంట్స్ చేస్తే తాట తీస్తాం

హైదరాబాద్, ఆగస్టు 12 : హిళలను కించ పరిచి అదే కామెడీ, డార్క్ కామెడీ అంటూ కంటెంట్ క్రియేట్ చేసే వారికి, ఇన్ ఫ్లూయన్సర్లకు తెలంగాణ మహిళా కమిషన్ స్పష్టమైన సూచనలతో హెచ్చరికలు జారీ చేసింది. ప్రాథమిక హక్కుల్లో వాక్ స్వాతంత్ర్యం ఉంది కానీ.. దానికి కొన్ని పరిమితుల్ని రాజ్యంగంలో పెట్టిందని తెలంగాణ మహిళా కమిషన్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చాలా మంది కంటెంట్ క్రియేటర్లు హద్దులు దాటిపోతున్నారని గుర్తు చేసింది. తండ్రీ, బిడ్డల విషయంలో ఇటీవల కొంత మంది చేసిన తరహా వీడియోలు ఏ మాత్రం క్షమించేవి కావని అందుకే.. . కంటెంట్ క్రియేటర్లకు.. ఇన్ ఫ్లూయన్సర్లకు.. నిబంధనలు జారీ చేస్తున్నామని తెలిపారు. పబ్లిక్ ఆర్డర్, కనీస హుందాతనం, నైతికత అనేవి మొదటగా కంటెంట్ క్రియేటర్లు, ఇన్ ఫ్లూయన్సర్లుగా మొదటగా చూసుకోవాల్సిన అంశం. ముఖ్యంగా మహిళాలకు సంబంధించిన ఎలాంటి చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్ ఉండకూడదు.

సంపుటి: 16 సంచిక : 92 కరీంనగర్ మంగళవారం, ఆగష్టు 13, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

## త్వరలో ఖమ్మం ఖిల్లాకు రోప్ వే: ఉప ముఖ్యమంత్రి భట్టి

ఖమ్మం : ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఖిల్లాను పరిశీలించిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏడాది కాలంలోనే రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధిని చూస్తారు. పర్యాటక రంగం అభివృద్ధికి ఎన్ని నిధులైన కేటాయిస్తాం. తెలంగాణ పర్యాటకానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రపంచ పటంలో స్థానం కల్పిస్తాం. ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలో మంత్రులు, ఎశ్రీజీ లను తీసుకొని పర్యాటక ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం కల్పించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి నిర్ణయించడం అభినందనీయం అన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వారు మహబూబ్నగర్ జిల్లాలో కార్యక్రమం పూర్తిచేసుకుని ఖమ్మం జిల్లాలో ప్రారంభించారని వివరించారు. నెలకు ఒకసారి మంత్రులు ఎమ్మెల్యేలు ఆయా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో కుటుంబాలతో సహా బస చేయాలని మంత్రిగారు నిర్ణయించడం మంచి విషయం అన్నారు. ఖమ్మం జిల్లాలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. కిన్నెరసాని నుంచి భద్రాచలం వరకు అడవులు ఎకో టూరిజానికి అనువుగా ఉన్నాయని తెలిపారు. నేలకొండపల్లిలోని బౌద్ధ స్తూపం మొదలు జమలాపురం మీదుగా భద్రాచలంలోని సీతారాముల ఆలయం వరకు టెంపుల్ టూరిజం అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ఖిల్లా కు రోప్ వే కావాలన్న డిమాండ్ సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉందని తెలిపారు. రోప్ వే నిర్మాణానికి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుమతులు ఇస్తూ వెంటనే సంతకాలు చేశారని త్వరలోనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని వాటిని కొద్ది నెలల్లోనే పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు నేలకొండపల్లి బౌద్ధ ఆరామాల వద్దకు జపాన్ లాంటి దేశాల నుంచి బుద్ధిష్టులను ఆహ్వానించాలన్నారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు వచ్చి స్థానికంగా ఆదాయం పెరిగి యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. హైదరాబాద్ సాఫ్ట్వేర్ కు కేంద్రం. ఆ ఉద్యోగులు నెలకు ఒకసారి సెలవు దొరికితే ప్రశాంతంగా గడిపేందుకు అడవుల్లో ట్రెక్కింగ్, వాకింగ్ ట్రాక్, రిసార్ట్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. వారానికి లేదా నెలకు ఒకసారి ఆటవిడుపు కోసం ఈ పర్యాటక ప్రాంతాలు ఉపయోగపడతాయన్నారు. ఆటవిడుపుతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తే పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంత్రి జూపల్లి నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగం దేదీప్యమానంగా వెలుగుందుతుందన్నారు.

## సౌత్ కొరియాలో రేవంత్ టీమ్

హైదరాబాద్, ఆగస్టు 12 : మెరికాలో పర్యటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు దక్షిణకొరియాలో పెట్టుబడుల అన్వేషణలో పడ్డారు. అమెరికా పర్యటన విజయవంతమైందని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. దాదాపు 30వేల కోట్లకుపైగా పెట్టుబడులు తెలంగాణలో పెట్టేందుకు వివిధ సంస్థల ప్రతినిధులు అంగీకారం తెలిపారని అంటున్నారు. అమెరికా పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో రేవంత్ విజయవంతమయ్యారని అంటున్నారు. ప్రస్తుతం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న రేవంత్ రెడ్డి కొరియన్ పర్యటన చాలా సానుకూలంగా ప్రారంభమైందని ట్వీట్ చేశారు. ఒఉ గ్రూప్‌లో భాగమైన ఒూ కార్పొరేషన్‌తో చర్చలు ప్రారంభించామన్నారు. ఎల్ఎస్ గ్రూప్ ఛైర్మన్ మిస్టర్ కూ జా యున్ ప్రతినిధుల బృందంతో సమావేశమైనట్టు వెల్లడించారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుల్స్, గ్యాస్, ఎనర్జీ, బ్యాటరీల తయారీ పెట్టుబడులు సహా వివిధ అంశాలపై మాట్లాడుకున్నట్టు తెలిపారు. తన ఆహ్వానం మేరకు ఒూ బృందం త్వరలో రాష్ట్రానికి రానుందన్నారు. రాబోయే రోజుల్లో వారిని పెట్టుబడిదారుగా స్వాగతించబోతున్నామని అన్నారు రేవంత్ రెడ్డి.ప్రపంచంలోనే అగ్రశ్రేణి సంస్థలుగా ఉన్న వారంతా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంటోంది. అమెరికా వేదికగా తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా రేవంత్ ప్రకటించడం, కొత్త నిర్మించబోయే నగరం ఏలా ఉంటుందో చెప్పడం కూడా పర్యటన విజయవంతమవడానికి కారణమయ్యాయి అంటున్నారు. అందుకే 31532 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు దాదాపు 19లతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నట్టు చెబుతున్నారు. ఈ కంపెనీలు లైవ్‌లోకి వస్తే దాదాపు 30వేలకుపైగా ఉద్యోగాలు లభించనున్నాయని అంటున్నారు. ఈ నెల 3వ తేదీన పారిశ్రమికమంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు వెళ్లారు. వారం



రోజుల పాటు అక్కడ పర్యటించారు. దాదాపు యాభైకిపైగా బిజినెస్ మీటింగ్స్, 3 రౌండ్ టేబుల్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. వారితో ఎక్కువ మంతనాలు జరిపారు. హైదరాబాద్‌లో కొత్త నిర్మించబోయే నగరాన్ని దృష్టిలో పెట్టుకొని రేవంత్ రెడ్డి పర్యటన సాగింది. ప్రపంచంలో అగ్రశ్రేణి సంస్థలైన కాగ్నిజెంట్, చార్లెస్ స్క్వాబ్, ఆర్సీసియం కార్నింగ్, ఆమ్జెన్, జొయిటిస్, హెచ్సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మో ఫిసర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు తమ విస్తరణ ప్రాజెక్టులను తెలంగాణలో పెట్టేందుకు ఆసక్తి చూపించాయి. అమెజాన్ కూడా తమ డేటా సెంటర్ విస్తరణకు ఓకే చెప్పింది.

## హర్ ఘర్ తిరంగా.. మనందరి బాధ్యత!

హైదరాబాద్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి కోరారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా.. హైదరాబాద్ లోని తమ నివాసంలో కిషన్ రెడ్డి దంపతులు జాతీయ జెండాను ఎగురవేశారు. మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ప్రజలందరి భాగస్వామ్యంతో ఘనంగా జరుగుతున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర్య పండుగ సందర్భంగా 23 కోట్ల మంది భారతీయులు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారని, రేపటి స్వాతంత్ర్య దినోత్సవం వరకు ఈ స్ఫూర్తిని కొనసాగించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు తిరంగా ర్యాలీలు నిర్వహించి.. ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలన్నారు. దేశ సమైక్యతను కాపాడుకునే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాలుపంచుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. ఆగస్టు 9న దేశవ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగనుంది.

## కేంద్రం, పంజాబ్ సర్కారు మధ్య ముదురుతున్న వివాదం



మెరుగైన రహదారి సదుపాయం ఆ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి మూలం. ఒక్క రహదారితో యావత్ ప్రాంత ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మౌలిక వసతులు.. ముఖ్యంగా రహదారి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. ప్రతియేటా మూలధన వ్యయాన్నిపెంచుకుంటూ పోతూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. అయితే జాతీయ రహదారులకు పూర్తిగా నిధులు సమకూర్చేది కేంద్ర ప్రభుత్వమే అయినప్పటికీ.. అందుకు అవసరమైన భూమిని సేకరించి ఇవ్వాల్సిన బాధ్యత ఆయా రాష్ట్రాలపై ఉంటుంది. తమ రాష్ట్రానికి హైవే, ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టులు కావాలంటూ ప్రతి రాష్ట్రం కేంద్రానికి అర్జీ పెట్టుకుంటున్న ఈ రోజుల్లో, ప్రాజెక్టు మంజూరు కావడమే ఆలస్యం భూసేకరణ చేపట్టి అప్పగించేందుకు అన్ని రాష్ట్రాలు ఉత్సాహంగా ఉన్నాయి. అయితే అందరిదీ ఒక దారి, నాది మరో దారి అన్నట్టుగా వ్యవహరిస్తోంది పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం. ఫలితంగా ఆ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 41 జాతీయ రహదారి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ అంశంపై తాజాగా సమీక్ష నిర్వహించిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.. పంజాబ్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భూసేకరణ చేపట్టి అప్పగించకపోగా.. రైతులు, భూ యజమానుల నుంచి ప్రాజెక్టు నిర్మాణ సంస్థలపై జరుగుతున్న దాడులను సైతం రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించలేక చేతులెత్తేస్తోంది. ఫలితంగా అనేక ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయాయి. రాష్ట్రం మొత్తమ్మీద 1,500 కి.మీ పొడవున మంజూరైన 41 హైవే ప్రాజెక్టులకు కేంద్రం రూ. 52,000 కోట్లు ఖర్చు చేస్తోంది. వాటిలో 7 చిన్న ప్రాజెక్టులు 80-90% మేర పూర్తవగా, మిగతా 34 మేజర్ ప్రాజెక్టుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. భూసేకరణ జరపకపోవడమే ఇందుకు కారణమని తేలింది. వ్యవసాయ భూములను రహదారులు లేదా ఇతర జాతీయ ప్రాజెక్టుల కోసం వదులుకోవడం ఎవరికైనా బాధాకరమే. భూమితో ఎంతో అనుబంధం పెనవేసుకొన్న రైతులైతే తమ భూమిని విడిచిపెట్టేందుకు ససేమిరా అంటారు. ఇది దేశంలో ఎక్కడైనా ఉన్న పరిస్థితే. అయితే దేశాభివృద్ధి కోసం ప్రాజెక్టులు కూడా అవసరమే. ఇది గ్రహించిన రైతులు చివరకు అంగీకరిస్తూ ఉంటారు. అయితే తాము కోల్పోయిన భూమికి సమానంగా మరో చోట భూమి లేదా, తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తుంటారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితి వేరు. పంజాబ్ రాష్ట్రంలో వేరు. ఇక్కడ భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, నిర్మాణ సంస్థ సిబ్బందిపై హింసాత్మక దాడులకు సైతం తెగబడుతున్నారు. రైతులతో చర్చలు జరిపి, నచ్చజెప్పి ఒప్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. పైపెచ్చు శాంతిభద్రతలను కూడా కాపాడడంలో విఫలమవుతోంది. ఇదే ఆ రాష్ట్రంలో ప్రాజెక్టుల పురోగతిని నిలువరిస్తోంది. పంజాబ్ రాష్ట్రంలో మంజూరైన, నిర్మాణంలో ఉన్న మిగతా అన్ని ప్రాజెక్టుల కంటే ఢిల్లీ-అమృత్‌సర్-కాట్రా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే భారతదేశానికే ఒక ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు. జమ్ము-కాశ్మీర్‌లో ఉన్న వైష్ణోదేవి ఆలయం, అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం చేరుకోవడానికి ఈ హైవే ఎంతో కీలకంగా మారుతుంది. ప్రయాణ సమయాన్ని సగానికి సగం తగ్గిస్తుంది. రాష్ట్రంలో మంజూరైన జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో ఇప్పటికే మూడింటిని రద్దు చేసింది.

## తెలంగాణలో కండ్లముందే సాగు విస్తీర్ణం ఢమాల్: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి గడ్డుకాలం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలోనే రాష్ట్రంలో 15.30 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గిందని చెప్పారు. దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో ఎనిమిది నెలల్లోనే ఎందుకింత విధ్వంసం అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసానే లేదని విమర్శించారు. బురద రాజకీయాలు తప్ప సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి అసలే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నయ్, కానీ చేతలు మాత్రం సచివాలయం గేటు దాటడం లేదని ఎద్దేవా చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలది అత్యంత దయనీయ పరిస్థితి అంటూ ఎక్స్ వేదిగా ట్వీట్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సాగుకు స్వర్ణయుగం, కాంగ్రెస్ రాగానే వ్యవసాయానికి గడ్డుకాలం. ఇది కాంగ్రెస్ సర్కార్ చేసిన కమాల్.. తెలంగాణలో సాగు విస్తీర్ణం కళ్ళముందే ఢమాల్. ఒక్క ఏడాదిలోనే 15.30 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు విస్తీర్ణం, ఆగమైతున్న తెలంగాణ రైతు బతుకుకు తొలి ప్రమాద సంకేతం..! దశాబ్ద కాలంలోనే దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణలో ఎనిమిది నెలల్లోనే ఎందుకింత వ్యవసాయ విధ్వంసం..?. సంతోషంగా సాగిన సాగులో ఎందుకింత సంక్షోభం..? మొన్న వ్యవసాయానికి కరెంట్ కట్, నిన్న రుణమాఫీలో రైతుల సంఖ్య కట్, నేడు సాగయ్యే భూమి విస్తీర్ణం కట్. రుణమాఫీ అని మభ్య పెట్టి పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ అవస్థ. రూ.500 బోనస్ అని నిలువునా మోసం చేసింది ఈ కాంగ్రెస్ వ్యవస్థ. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నయ్, కానీ చేతలు సచివాలయం గేటు దాటడం లేదు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు అన్నదాతలది అత్యంత దయనీయ పరిస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకునే విజన్ లేదు, రిజర్వాయర్లు నింపే ప్రణాళిక లేదు, చెరువులకు మళ్లించే తెలివి లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పాలనలో రైతు బతుకుకు భరోసానే లేదు. బురద రాజకీయాలు తప్ప సమయానికి సాగు నీళ్లిచ్చే సోయి అసలే లేదు. ఎరువులు-విత్తనాల కోసం రైతులకు తిప్పలు, క్యూలైన్ లో పాసుబుక్కులు, చెప్పులు. కొత్త రుణాల కోసం బ్యాంకుల వద్దే పగలూ రాత్రి తేడాలేకుండా పడిగాపులు. అప్పుల బాధతో అన్నదాతల ఆత్మహత్యలు, కౌలు రైతుల బలవన్మరణాలు. ఇలా ఒకటా రెండా.. సాగు విస్తీర్ణం తగ్గడానికి కారణాలు.. సవాలక్ష!!'

## మరుపురాని మనిషి జర్నలిస్టు మధునయ్య



సీనియర్ జర్నలిస్టు మధునయ్య ఆగస్టు 7 ఉదయం 4 గంటలకు ఇంట్లోని తాడుతొ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వారం రోజులు కావస్తున్నప్పటికీ ఈ విషాదాన్ని సింగరేణి ప్రాంత ప్రజలు, రాజకీయ శ్రేణులు మరువలేక పోతున్నారు. జీవనోపాధికి కొలువునిచ్చిన సింగరేణి తల్లి సామాజిక రంగంలో జర్నలిస్టుగా ఆ తల్లి ఒడిలోనే పెరిగిగాడు నాయిని మధురయ్య. సింగరేణి కార్మికుల సమస్యలపై గత నాలుగు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేసిన కలం కార్మికుడు నాయిని మదనయ్య. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఫైవ్ ఇంక్లైన్ ఏరియాలో పుట్టి పెరిగి జర్నలిస్టుగా సృజనాత్మకమైన కర్తవ్యాన్ని నిర్వహించాడు. అనేక సామాజిక విషయాలపై స్పందించి ఎన్నో విశ్లేషణాత్మక కథనాలను రాశాడు. కానీ తన వ్యక్తగత జీవితంలో కొచ్చర్ల ప్రవీణ్ అనే బిల్డర్ ప్రవేశం తీవ్ర అశాంతిని తెచ్చిపెట్టింది. 40 లక్షల ఇంటి నిర్మాణ వ్యాయాన్ని 60 లక్షలకు చేర్చాడు. పెద్దపల్లి పోశమ్ కు అమ్మిన భూమిని నాయిని మధునయ్యకు అమ్ముతానని మరో 13 లక్షలు తీసుకున్నాడు. నిజాలు తెలుసుకున్న మధునయ్య ప్రవీణ్ ను నిలదీశాడు. అదే భూమిలో ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చాడు. ప్రవీణ్ భార్య లలితకు ప్రవీణ్ కు మధ్య తీవ్ర విభేదాలు వచ్చాయి. గత సంవత్సరం భర్తను హత్య చేసి లలిత జైలుకు వెళ్లి వచ్చింది. అపరిష్కృతంగా ఉన్న భూమి లేదా డబ్బు సమస్యపై ఆగస్టు 4న ప్రవీణ్ భార్య లలిత పెద్దపెల్లి పోచం లను మధునయ్య అడగడం జరిగింది. నేర ప్రవృత్తి గల పోచం లలిత లు మధునయ్య ను బూతులు తిట్టారని తెలుస్తోంది. ఆ విధంగా మదనయ్య పై అమానుషంగా ప్రవర్తించారు. జరిగిన అవమానాలను మధునయ్య ఎదుర్కోలేకపోయాడు. ఒక బలహీనమైన క్షణంలో ఆగస్టు 7 ఉదయం 4 గంటలకు మృత్యువు తనను ఆవహించి కబళించింది. పర్యవసరంగా మధునయ్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక లావాదేవీలలో విభేదాలు చోటు చేసుకుంటే పరిష్కరించుకోవాల్సిన మిత్రులే శత్రువులై వేధించడం విచారకరం. ఇక్కడే సమాజంలో, కుటుంబంలో మానవ సంబంధాలు ధ్వంసమై పోతున్నాయి. నీతి నిజాయితీ కలిగి జర్నలిజాన్ని నమ్ముకున్న ఒక మంచి జర్నలిస్టు మరణానికి కారణమయ్యారు. సౌమ్యుడైన మధునయ్యను రామగుండం పారిశ్రామిక ప్రాంతం కోల్పోయింది. తెలంగాణ సాయుధ పోరాటం మొదలు మొన్నటి తెలంగాణ రాష్ట్ర విభజన వరకు సింగరేణి కార్మికులు చేసిన ప్రతి పోరాటాన్ని తన కలంతో చరిత్రలో నమోదు చేశాడు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికులపై తీసుకోవచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా తన కలంతో కార్మికుల వాణి ని వినిపించాడు. సీనియర్ జర్నలిస్టు మధునయ్య మరణం ఒక విషాదాంతం. జీవగడ్డ ఉదయం వార్త పలు పత్రికల్లో ఆయన పనిచేసిన విషయం ప్రజలందరికీ తెలిసిందే. రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి జర్నలిస్టు మధునయ్య లేని లోటు ఎవరు పూరించలేనిది.

బోనగిరి నర్సింగ్

ఎడిటర్

( తెలంగాణ ఫోకస్)

# తెలంగాణ నుండి ఫోకస్

తెలుగు దినపత్రిక

మంగళవారం, ఆగష్టు 13, 2024


# లీవ్ ఇండియా ఎందుకు

భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశం.. ఇది ఎప్పటి నుంచో చదువుతున్నదే. ప్రపంచ దేశాలతో ఎన్నో విషయాల్లో పోటీ పడుతున్న భారత్ అభివృద్ధి చెందిన దేశం అని ఎప్పుడు అనిపించుకుంటుందోనని చాలా మంది ఎదురుచూస్తున్నారు. అంతరిక్షం, క్రీడలు, ఇతర విషయాల్లో భారత్ మిగతా దేశాల కంటే మెరుగైనప్రతిభను కనబరుస్తుంది. కానీ మానవ వనరుల అభివృద్ధి విషయంలో రోజురోజుకు క్షీణిస్తుంది. ఇది గ్రహించిన చాలా మంది తమ భవిష్యత్ కోసం దేశాన్ని విడిచి వెళుతన్నారు. ఉన్నత చదువులకోసమని విదేశాలకు వెళ్తున్న యువత అక్కడే సెటిలవుతోంది. ఇక్కడి నుంచి తమ కుటుంబాన్ని తీసుకెళ్లి విదేశీ పౌరులుగా మారుతున్నారు. ప్రస్తుతం పలు దేశాల్లో భారత్ సంతతికి చెందిన వారే మంచి పొజిషన్లో ఉన్నారు. మున్ముందు మరింత మంది ఇలాంటి వారు కనిపిస్తారు. అయితే భారత్ నుంచి ఇలాంటి నైపుణ్యం ఉన్నవారు ఎందుకు తరలిపోతున్నారు? భారత్ లో ఉన్న మైనస్ ఏంటి? ఆ వివరాల్లోకి వెళితే..2024 కేంద్ర బడ్జెట్ ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ సందర్భంగా పన్ను విధానంలో మార్పులు చేశారు. స్టాండర్డ్ డిటక్షన్ రూ.50 వేల నంచి రూ. 75 వేలకు పెంచారు. ఇదే సమయంలో దీర్ఘ కాలిక పెట్టుబడులపై 12 శాతం, స్వల్ప కాలిక మూలధన లాభాలపై 20 శాతం పెంచారు. దీంతో చాలా మంది యువత ఈ పన్నుల భారం పడలేకపోతుందని తెలుస్తోంది. కొందరు ఉన్నతంగా ఎదగాలని చూసినా వారికి పన్నుల రూపంలో అడ్డు తగులుతున్నట్లు తెలుస్తోంది. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ లో నైపుణ్యం కలవారు ఎక్కువ. అందుకే చాలా దేశాలు ఇండియాకు చెందిన వారు నియమించుకుంటున్నారు. భారత్ కంటే ఎక్కువ స్థాయిలో వేతనాలు అందిస్తూ పన్ను మినహాయింపు ప్రకటిస్తున్నారు. 2023 లెక్కల ప్రకారం భారత్ నుంచి 13.2 లక్షల మంది 68 దేశాలకు ఉన్నత విద్యకోసం తరలివెళ్లారు. వీటిలో అత్యధికంగా కెనడాలో 4.27 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. ఆ తరువాత అమెరికాలో 3.51 లక్షలు, యూఏఈలో 2.47 లక్షలు, ఆస్ట్రేలియాలో 1.25 లక్షల మంది తరలివెళ్లారు. దశాబ్ద కాలంలో భారతీయ పౌరులపై ప్రభుత్వాలు అధిక పన్నుభారం వేస్తున్నాయి. కొందరు మెరుగైన ఉద్యోగాలు సాధించినప్పటికీ వారికి వచ్చే ఆదాయంలో పన్ను చెల్లించడమే ఎక్కువవుతోంది. ఈ కారణంగా విదేశాలకు వెళ్తున్నారు. ఇప్పటి వరకు విదేశాలకు వెళ్లిన వారు తమ కుటుంబాలను తీసుకెళ్తే 1 కోటి జనాభా తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా విదేశాల్లో చదివే విద్యార్థులు తమ విద్య కోసం రూ.33 కోట్లు వెచ్చిస్తున్నారు. భారత్ ఈ ఆదాయాన్ని కోల్పోతున్నట్లే చెప్పారు. అయితే మెరుగైన విద్య అందిస్తూ పన్నుల భారం తగ్గిస్తే ఈ ఆదాయం వచ్చే అవకాశం ఉందని కొందరు ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇక 2020లో భారత పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య 85,256. 2019లో ఇది 1,44,017. 2015 నుంచి 2020 మధ్య 8 లక్షల మందికి పైగా ప్రజలు భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. కరోనా వల్ల 2020లో ఈ సంఖ్య తగ్గినట్లుగా కనిపిస్తోంది. '2021లో విదేశాల్లో పౌరసత్వం తీసుకున్న వారి సంఖ్య పెరిగినట్లు కనిపించడానికి కారణం కరోనా. 2020లో కరోనా వల్ల సిటిజెన్‌షిప్ లభించని వారికి ఆ తరువాత ఏడాది లభించింది' అని విదేశీ వ్యవహారాల నిపుణుడు హర్ష్ పంత్ తెలిపారు చిన్నచిన్న దేశాలు కూడా వ్యాపారం చేసుకోవడానికి మంచి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఆయా దేశాల్లో ఇప్పటికే స్థిరపడ్డ బంధువుల సాయంతో కొందరు అక్కడకు వెళ్తున్నారు' అని హర్ష్ పంత్ వివరించారు. జర్నలిస్ట్ అయిన హరేంద్ర మిశ్ర, 22 ఏళ్లుగా ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. తనకు భారత్‌తో చాలా ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందని, అందువల్లే ఇండియా పౌరసత్వాన్ని వదులుకోలేక పోతున్నానని ఆయన అన్నారు. ఆయన భార్యది ఇజ్రాయెల్. వారి ఇద్దరు పిల్లలు అక్కడే పుట్టారు. వారికి ఆ దేశ పౌరసత్వం ఉంది.'ఇండియా పాస్‌పోర్ట్ వల్ల ఒక సమస్య ఉంది. చాలా దేశాలకు వెళ్లాలంటే వీసా తీసుకోవాల్సి ఉంటుంది. లండన్ వెళ్లాలంటే నేను తప్పకుండా వీసా తీసుకోవాలి. కానీ ఇజ్రాయెల్ పాస్‌పోర్ట్ ఉంటే వీసా అవసరం లేదు. వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా ఇక్కడ ఆఫీసు లేదు. స్టాంపింగ్ కోసం ఇస్తాంబుల్ పోవాల్సి ఉంటుంది. అక్కడికి వెళ్లి రావడానికి చాలా ఖర్చు అవుతుంది. నేను సెంటిమెంటల్‌గా భారత పౌరసత్వం ఉంచుకున్నా. కానీ దాని వల్ల నాకు అంతకు మించి పెద్ద ప్రయోజనం ఏమీ లేదు' అని హరేంద్ర మిశ్ర వివరించారు. ప్రస్తుతం భారత్ పాస్‌పోర్ట్‌తో వీసా లేకుండా 60 దేశాల వరకు వెళ్లొచ్చు. ఇతర దేశాల పాస్‌పోర్టులతో పోలిస్తే ఇది తక్కువే. పాస్‌పోర్ట్ ర్యాంకుల్లో 199 దేశాల్లో 87వ స్థానంలో భారత్ ఉంది. ఈ పన్ను విధానంలో మార్పులు తీసుకురాకపోతే మున్ముందు భారత్ లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు కనిపించరని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కొందరు కోరుతున్నారు

# పల్లెలకు మళ్లీ ఎన్ని'కళ'





జనగామ, ఆగస్టు 12 : గ్రామ పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నగారా మోగనుంది. స్థానిక ఎన్నికల నిర్వహణపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కసరత్తు సైతం ప్రారంభమైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన వార్డుల విభజనపై ప్రభుత్వం మొదటగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇటీవల జిల్లా ప్రాజెక్టు మేనేజరు, కంప్యూటర్ ఆపరేటర్లకు హైదరాబాద్‌లో శిక్షణ కూడా పూర్తి అయింది. కాగా.. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో జిల్లాలోని ఎంపీడీవో, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితాను అందించాలని ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ రాసింది. ఎన్నికల సంఘం నుంచి నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఓటరు జాబితా రాగానే వార్డుల వారీగా విభజన చేయాలని నిర్ణయించింది. వార్డుల విభజనకు సంబంధించి పాటించాల్సిన మార్గదర్శకాల పై మాస్టర్ ట్రైనర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఒకే కుటుంబం అంతా ఒకే వార్డు పరిధిలో ఉండేలా విభజన చేయాలని ప్రధానంగా ప్రభుత్వం ఆదేశించింది. గత ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలో ఓటర్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడం, కొన్ని చోట్ల ఇతర గ్రామాల్లోనూ ఓటరుగా నమోదు అయి ఉండ డం లాంటివి ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను అంతా ఒక వార్డు పరిధిలోకే వచ్చేలా విభజన చేయనున్నారు. ఈ క్రమంలో రెండు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకొని జాబితా తయారు చేయా లని సూచించా రు. ఓటరు లిస్ట్‌లో కుటుంబ సభ్యులం తా ఒకే వరుస క్రమంలో ఉం డేలా చూసుకో వాలని ప్రభుత్వం సూచించి ంది. ఇందు కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఆ సాఫ్ట్‌వేర్ ద్వారా వార్డుల విభజన చేయనున్నారు. కాగా.. వార్డుల విభజనకు ప్రభుత్వం ఎలాంటి గడువు విధించలేదు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పం చి ఎన్నికలను మూడు విడతలుగా ప్రభుత్వం నిర్వహించనుంది. ఒకే సారి ఎన్నికలు నిర్వహించేందుకు సిబ్బంది సరిపడకపోవ డంతో మూడు విడతలుగా ఎన్నికలను నిర్వహిస్తుంటారు. జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు, 2564 వార్డులకు ఎన్నికలు జరుగు తాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సిబ్బంది కేటాయింపుపై ఎన్నికల సంఘం గతంలోనే మార్గద ర్శకాలు జారీ చేసింది. వాటి ప్రకారం.. ఒక్కో వార్డుకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయను న్నారు. ఓటర్ల ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలకు ప్రిసై డింగ్ అధికారి, పోలింగ్ అధికారులను కేటాయించనున్నారు. 200 ఓట్ల లోపు ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక పోలింగ్ అధికారి, 200-400 ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 650 పైన ఓట్లు ఉన్న కేంద్రాలకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. 650 ఓట్లు పైన ఉన్న గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం గత ఏడాది డిసెంబరులో సూచించింది. - 2024 ఫిబ్రవరి 1తో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగిసింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం పూర్తి అయ్యే లోపే ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. 2019 జనవరిలో నెలలో జనగామ జిల్లాలోని పంచాయతీలకు ఎన్నికలు జరగగా ఐదేళ్ల తర్వాత సరిగ్గా అదే జనవరి లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ.. అసెంబ్లీ ఎన్నికలు, కొత్త ప్రభుత్వం కావడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాలేదు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో మరింత ఆలస్యం అయింది. కాగా.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల అవసరమయ్యే పోలింగ్ సిబ్బంది, గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రస్తుత ఓటర్లు, గత ఎన్నికల సందర్భంగా వార్డులకు, సర్పంచి పదవి ఉన్న రిజర్వేషన్ ఏంటన్న అంశాలపై ఎన్నికల సంఘం కలెక్టర్ల నుంచి గత ఏడాది డిసెంబరులోనే నివేదిక కోరింది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులను శాఖల వారీగా, పే స్కేల్ వారీగా వర్గీకరణ చేసి 'తెలంగాణ-పోల్'(టీఈ-పోల్) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఉద్యోగుల వివరాలతో పాటు 2009, 2014, 2019 పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను ఈనెల 30 లోగా 'పీపీఆర్ఎస్' మాడ్యూల్‌లో గత ఏడాది పొందుపరిచారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఎన్నికల నిర్వహణపై ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయనే ప్రచారం జరుగుతోంది.

# విచ్చలవిడిగా సిట్టింగులు



పెద్దపల్లి : జిల్లాలో గల మద్యం షాపుల్లో ఏర్పాటు చేసిన పర్మిట్ రూములు బార్‌లను తలపిస్తున్నాయి. నిబంధనలను గాలికి వదిలేసి పెద్దపెద్ద రేకుల షెడ్లు వేసి బెంచీలు, బల్లాలు వేసి యథేచ్ఛగా సిట్టింగులను నడిపిస్తున్నారు. ఆయా వైన్ షాపుల పక్కన, వెనుకాల నివాస గృహాలు ఉన్నా కూడా పర్మిట్ రూములను నడిపిస్తున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం ఒక చిన్న గదిలో మాత్రమే పర్మిట్ రూములను నిర్వహించాల్సిన వైన్ షాపుల యజమానులు పెద్ద ఎత్తున సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రభుత్వం విధించే టార్గెట్‌ల మేరకు మద్యం అమ్మకాలపైనే దృష్టి సారిస్తూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పర్మిట్ రూముల్లో ఎలాంటి బెంచీలు గానీ, బల్లలు గానీ వేయకుండా నిర్వహించాల్సి ఉంటుంది. కేవలం గ్లాసులు, మందు సీసాలు పెట్టుకునేందుకు మాత్రమే వాల్ చెక్కలు వేయాలి. కానీ ఒక్కో వైన్ షాపు యజమాని పెద్దపెద్ద షెడ్లను ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖాధికారులకు నెలనెలా మామూళ్లు ముట్టజెబుతూ బార్లను తలపించేలా పర్మిట్ రూములను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలా వైన్ షాపుల పర్మిట్ రూములు బార్‌లను తలపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 76 మద్యం షాపులు నడుస్తుండగా, 12 వరకు బార్‌లు ఉన్నాయి. వైన్ షాపు పర్మిట్ రూముల్లో నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు నిర్వహిస్తూ బార్ల గిరాకీని దెబ్బతీస్తున్నారు. ప్రతి వైన్ షాపునకు ఒక పర్మిట్ రూం తప్పనిసరి. ఇందుకోసం ఏడాదికి రెండు లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. గోదావరిఖని, రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పట్టణాల్లో బార్లు ఉన్నాయి. ధర్మారం, అంతర్గాం, పాలకుర్తి, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో బార్లు లేవు. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ఉండే పలు వైన్ షాపులు, గల్లీల్లో ఉండే కొన్నిషాపుల్లో విచ్చలవిడిగా సిట్టింగులను నిర్వహిస్తున్నారు. మండలాలు, కొన్ని పట్టణాల్లో ఉన్న వైన్‌షాపుల్లో పర్మిట్ రూములను బార్ల వలే నిర్వహిస్తున్నారు. మద్యం ప్రియులకు కావాల్సిన తినుబండారాలు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తున్నారు. ఈ సిట్టింగుల వల్ల మద్యం ప్రియులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. ప్రమాదాలకు గురవుతున్నారు.

# ప్రజాస్వామ్య లోటుతో బంగ్లా ప్రళయం



జూలై 4, 1776న పదమూడు అమెరికా రాష్ట్రాలు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. ఫ్రెంచ్ విప్లవం సంభవించి రెండు శతాబ్దాలకు పైగా గడిచిపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి స్వేచ్ఛ పొందిన తొలి వలస రాజ్యం ఆస్ట్రేలియా (1901లో). భారత్ 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ఇప్పటికీ స్వతంత్ర, ప్రజాస్వామిక దేశాలుగా వర్ధిల్లుతున్నాయి. వలస పాలనా శక్తుల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, పోర్చుగల్ మొదలైనవి) నుంచి విముక్తి పొందిన దేశాలన్నీ చిరకాలం నిజంగా 'స్వతంత్ర' దేశాలుగా లేవు. పలు దేశాల పౌరులు అందరూ పౌర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పూర్తిగా నోచుకోవడం లేదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షికమైన ఎన్నికలలో తాము కోరుకుంటున్న వారిని ఎన్నుకోలేని దుస్థితి నెదుర్కొంటున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచ జనాభాలో కేవలం 20 శాతం మంది మాత్రమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతున్నారు. ప్రజాస్వామిక హక్కులను అనుభవిస్తున్నారు. ఆ అదృష్ట భాగ్య దేశాలలో భారత్ కూడా ఉన్నది. ఇది మనకు సంతోషకరమేకాదు, గర్వకారణం కూడా. ప్రజాస్వామ్యం ఒకరు ఇచ్చేది కాదు. మరొకరి నుంచి స్వీకరించేదీ కాదు. ఆగస్టు 14, 1947న పాకిస్థాన్ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే అనేకమార్లు సైనిక నియంతృత్వ పాలనలోకి వెళ్లింది. మన మరో పొరుగు దేశం (తొలుత పాకిస్థాన్‌లో ఒక రాష్ట్రంగా ఉన్న) బంగ్లాదేశ్ పాకిస్థాన్‌ను ఏలిన సైనిక ప్రభుత్వాల పద ఘట్టనలో దశాబ్దాల పాటు నలిగిపోయింది. సైనిక పాలకులపై తిరుగుబాటుగా గెరిల్లా ఉద్యమం ఆరంభమయింది. క్రమేణా బలోపేతమై విముక్తి పోరాటంగా పరిణమించింది. భారత్ జోక్యంతో 1971లో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1975%-%91 సంవత్సరాల మధ్య పలువురు సైనిక పాలకులు వచ్చారు, పోయారు. ప్రధాన రాజకీయ పక్షాలు అవామీ లీగ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) కలసికట్టుగా సైనిక పాలకులను వ్యతిరేకించాయి. ప్రజాస్వామ్యం కోసం పోరాడాయి. 1991లో పౌర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అవామీ లీగ్ అధినేత్రి బేగం షేక్ హసీనా ప్రధానమంత్రిగా 1996లో ప్రప్రథమంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2008, 2014, 2019, 2024లో ఆమె ప్రధానమంత్రిగా ఎన్నికవుతూ వచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఎన్నికలను ప్రతిపక్షాలు బాయ్‌కాట్ చేశాయి. షేక్ హసీనా నేతృత్వంలో బంగ్లాదేశ్ గణనీయమైన ఆర్థిక పురోగతిని సాధించింది. బంగ్లా తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే అధికం. శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్ మొదలైన ఇతర దక్షిణాసియా దేశాల కంటే కూడా బంగ్లాదేశ్ ముందంజ వేసింది. మానవాభివృద్ధి సూచీలో బంగ్లాదేశ్, శ్రీలంక తరువాయి స్థానంలో ఉన్నదిబీ భారత్, నేపాల్, పాకిస్థాన్ కంటే ఉన్నత స్థాయిలో ఉన్నది. బంగ్లాదేశ్‌లో శిశు మరణాల రేటు భారత్‌లో కంటే తక్కువగా నమోదవుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికల నిర్వహణలో ఢాకా పాలకుల వ్యవహార శైలిని ఫ్రీడమ్ హౌజ్ నివేదిక తూర్పార బట్టింది. అలాగే పత్రికా స్వాతంత్ర్యం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో కూడా బంగ్లా పాలకుల తీరు తెన్నులు అంతర్జాతీయ సంస్థల ఆమోదాన్ని పొందలేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలను అదుపు చేస్తే లేదా నిరుద్యోగిత, అసమానతలు, వివక్షలపై ప్రజల అసంతృప్తి తగ్గితేనే ఆర్థికాభివృద్ధి సుసాధ్యమవుతుందని పాలకులు భావించడం కద్దు. అయితే ఇది చాలా చాలా అరుదుగా మాత్రమే నిజం. బంగ్లాదేశ్‌లో పాలకుల పట్ల ప్రజల వ్యతిరేకత మహోధృతంగా వెల్లువయింది. ప్రభుత్వోద్యోగాలలో వివక్షాపూరిత, ఆశ్రిత పక్షపాత రిజర్వేషన్ల విధానంతో విద్యార్థిలోకం ఆగ్రహావేశాలకు అవధులు లేకపోయాయి. ప్రజాస్వామ్య ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి. ఇదిలా వుండగా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల మందగించింది. ధరలు పెరిగాయి. ఉద్యోగాలు మృగ్యమయ్యాయి. పరిస్థితులు విషమిస్తున్నాయన్న వాస్తవాన్ని షేక్ హసీనా గుర్తించలేదు. గుర్తించినా నిరాకరిస్తూ వచ్చింది. ఇది నియంతలు అందరూ చేసే తప్పే. రిజర్వేషన్ల విధానం ఆందోళనాగ్నులకు ఆజ్యం పోసింది. అవినీతి, పోలీసు క్రౌర్యాలు, న్యాయవ్యవస్థ ఉదాసీనత మొదలైనవి కూడా బంగ్లా ప్రజల ఆందోళనను మరింత తీవ్రం చేశాయి. పర్యవసానాలు సుపరిచితమైన కథే కదా. సకల జనులు వీధుల్లోకి వచ్చారు. పోటెత్తారు. పోరాటాల వెల్లువలకు అడ్డు లేకపోయింది. ఇటువంటి పరిణామాలు ప్రభుత్వాలను కూల్చివేయడం సహజమే. ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది. వివిధ సంస్థలు, పలువురు వ్యక్తులు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించారు. విదేశీ జాతీయులు, మైనారిటీ వర్గాలు ఉద్యమ తీవ్రతను చవిచూడడం అనివార్యమవుతుంది. అల్పసంఖ్యాక వర్గాల గృహాలపై దాడులు జరుగుతాయి. వారి వ్యాపార సంస్థలు, ఆరాధనా మందిరాలను ధ్వంసం చేస్తారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అందుకు భిన్నమైనవి కావు. చాలా దేశాలలో అటువంటి ఉపద్రవాలలో మైనారిటీలు తీవ్ర ఇక్కట్లనే ఎదుర్కొన్నారు. కారణమేమిటి? ప్రజాస్వామ్య లోటు. దానివల్లే ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం అనివార్యమవుతుంది. పరిష్కారమేమిటి? ప్రజాస్వామ్య లోటును పూరించడమే. ప్రజాస్వామ్య లోటును పూరించడమనే కళలో అమెరికా, బ్రిటన్‌లు దాదాపుగా సమగ్ర ప్రావీణ్యాన్ని, పరిణతిని సాధించాయి. పార్టీలోను, పార్లమెంటులోను, ప్రజలలోను అసంతృప్తి తీవ్రమయినప్పుడు బ్రిటిష్ ప్రధానమంత్రులు థాచర్, జాన్సన్, మే స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలిగి కొత్త నాయకుడిని ఎన్నుకొనే అవకాశాన్ని తమ పార్టీకి కల్పించారు. అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్, జో బైడెన్‌లు అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేసేందుకు నిరాకరించారు. జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసి ప్రభుత్వాధినేతల రాజీనామాలు సాధించవచ్చు. పదవీకాల పరిమితులు కూడా చాలా ఉపయోగపడతాయి. పత్రికా స్వేచ్ఛ సంపూర్ణంగా ఉంటే పరిస్థితులను చక్కదిద్దడం మరింత తేలికవుతుంది సుప్రీంకోర్టు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య కాపలాదారుగా వ్యవహరించడం వల్ల చాలా మేలు జరుగుతుంది. స్వతంత్ర ఎన్నికల సంఘం ప్రతి ఐదేళ్లకు ఒకసారి విధిగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడం వల్ల పేదలు, అణగారిన వర్గాలవారు, నిర్లక్ష్యానికి గురవుతున్న వారికి ఎంతైనా ఉపశమనం కలుగుతుంది. పార్లమెంటు ప్రతి నెలా విధిగా సమావేశమవుతూ సభాపతి అనవసర జోక్యం లేకుండా ప్రతి రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాద ప్రతివాదనలు అనుమతించడమే ప్రజాస్వామ్య లోటుకు అంతిమ సమాధానమని నేను భావిస్తున్నాను.

# క్రైమ్ సిటీగా మారుతున్న టెంపుల్ సిటీ



**తిరుపతి :** టెంపుల్ సిటీలో క్రైమ్ రేట్ పెరిగిపోవడంతో జనంలో ఆందోళన నెలకొంది. వరుస హత్యలు, దాడులతో ఆధ్యాత్మికతకు మచ్చగా మారుతోంది. ఈ మధ్య కాలంలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఇందుకు అద్దం పడుతోంది. గంజాయి మత్తులోనే యువత నేరాలకు పాల్పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. 4రోజుల క్రితం తిరుపతిలోని సుందరయ్య నగర్?లో మైనర్ బాలిక ప్రేమ వ్యవహారంలో జరిగిన ప్రేమోన్మాద దాడి టెంపుల్ సిటీని ఉలిక్కిపడేలా చేసింది. ఈ క్రమంలోనే డ్రగ్ కల్చర్ కొనసాగుతుందన్న విషయం వెలుగులోకి వచ్చింది. సుందరయ్య నగర్?లో ఒక మైనర్ బాలికపై జరిగిన దాడి గంజాయి మత్తులోనే జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు టెంపుల్ సిటీలో చర్చగా మారింది. పదో తరగతి చదువుతున్న మైనర్ బాలికను సుందరయ్య నగర్?కు చెందిన బాలు అనే యువకుడు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. అదే క్రమంలో జరిగిన దాడిపై బాలిక తల్లి సుందరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉపాధి కోసం కువైట్?కు వెళ్లిన సుందరి మైనర్ కూతురు, కొడుకును సుందరయ్య నగర్?లోని తల్లి ముత్యాలమ్మ సంరక్షణలో పెట్టి చదివిస్తోంది. గత కొద్దికాలంగా సుందరయ్య నగర్?కి చెందిన బాలు అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు తెలుసుకుని.. సుందరి కుటుంబ సభ్యులు వారించే ప్రయత్నం చేశారు. కూతురు ప్రేమ విషయం తెలుసుకొని కువైట్ నుంచి తిరిగి వచ్చిన తల్లి సుందరి.. బాలు అనే యువకుడి నిర్వాకంపై నిలదీసింది. సుందరి కొడుక్కి, బాలు అనే యువకుడికి మధ్య ఈ వ్యవహారంపై ఘర్షణ కూడా జరిగింది. మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం రెండు రోజుల క్రితం కత్తులతో దాడికి దారి తీసింది. మైనర్ బాలిక అన్నకు.. బాలు బ్యాచ్ తో జరిగిన గొడవ కత్తిపోట్లకు దారితీసింది. మైనర్ బాలిక తల్లి సుందరి, మేనమామ సురేష్??, బాలు తమ్ముడు లోకేష్ కత్తిపోటుకు గురయ్యారు. ఇలా రెండు కుటుంబాల్లో ముగ్గురు గాయపడ్డారు. ఈ గొడవపై ఇరు వర్గాల ఫిర్యాదులతో తిరుపతి ఈస్ట్ పిఎస్ లో కేసులు కూడా నమోదు అయ్యాయి. అయితే మైనర్ బాలిక ప్రేమ వ్యవహారం, జరిగిన దాడులు గంజాయి మత్తు కారణమంద విమర్శలు ఉన్నాయి. గంజాయి, డ్రగ్స్ ముఠానే తన కూతురిని ట్రాప్ చేసేందుకు కారణమని తల్లి సుందరి అరోపిస్తోంది. అయితే అన్న బాలు బ్యాచ్ ఆగడాలను కూడా కొందరు వెలుగులోకి తెచ్చారు. మైనర్ బాలిక అన్న బాలుకు గంజాయి, డ్రగ్స్ అలవాటున్నట్లు ఆ బ్యాచ్ పై ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి వరుస ఘటనలు తిరుపతిలో భయాన్ని కలిగిస్తున్నాయి. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో డ్రగ్ కల్చర్ పెరిగిందని, గంజాయి మత్తుకు యువత బానిసవుతోందని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది. టెంపుల్ సిటీలో ఇలాంటి కల్చర్ వెంటనే నిరోధించాలంటున్నారు స్థానికులు. ఇక పోలీసు యంత్రాంగం గంజాయి అమ్మకం, వినియోగాన్ని కట్టడి చేయలేకపోతోంది. విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న గంజాయిపై ఉక్కు పాదం మోపలేకపోతోంది. తక్కువ ధరకు ఈజీగా దొరుకు తుండడంతో మైనర్ల జీవితం కూడా గంజాయితో ముడి పడిపోతుంది. అరకు టు చెన్నై, వేలూరు, బెంగళూరు వయా రేణిగుంట, తిరుపతి మీదుగా జరుగుతున్న గంజాయి సప్లై ఇలాంటి ఘటనలకు కారణం అవుతోంది. దీంతో మైనర్లు, స్టూడెంట్లు డ్రగ్ కల్చర్?ను స్వాగతిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలా గంజాయికి బానిసలు అవుతున్న యువతపై నిఘా పెట్టిన తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం కట్టడి చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కూడా ఏర్పాటు చేసింది. అయితే ప్రజల సహకారం ఉంటే తప్ప నిర్మూలించలేమని చేతులెత్తేస్తున్న పరిస్థితి నెలకొంది. గంజాయి అమ్మకం, వాడకంపై సమాచారమిచ్చి సహకరించాలని స్థానికులను కోరుతోంది పోలీసు యంత్రాంగం.

# వైసీపీ రహస్య బంధాలు



**విజయవాడ :** ఏపీలో వైసీపీ నేతల వ్యక్తిగత వ్యవహారాలు హాట్ టాపిక్గా మారుతున్నాయి. కొద్ది రోజుల కిందట ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యవహారం దుమారం రేపింది. తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి గుట్టు రచ్చకెక్కింది. వైసీపీలో ప్రముఖ నేతల భాగోతాలు ఇలా హైలెట్ అవుతూండటం ఆ పార్టీ ప్రతిష్టను మరింత డ్యామేజ్ చేస్తోంది. గతంతో పవన్ కళ్యాణ్ చట్టబద్దంగా చేసుకున్న వివాహాలపై జగన్ సాగతీస్తూ మరీ సన్నాయి నొక్కులు నొక్కారు. ఇప్పుడు విజయసాయి , శాంతి .. దువ్వాడ శ్రీను, మాధురిల రహస్యబంధాలపై రచ్చ జరుగుతున్నా జగన్ నోరు తెరవడంలేదు. నిజానికి అవేమీ పెద్ద విషయాలు కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలు వారి గురించి తెలిసే జగన్ ప్రోత్సహించారని అందుకే ఇప్పుడు బయట పడుతున్నా ఆయన పట్టించుకోవడం లేదన్న టాక్ వినిపిస్తుంది. జగన్కు అత్యంత సన్నిహితుడు, పర్సనల్ ఆడిటర్.. జగన్ ఏ-1గా ఉన్న అక్రమాస్తుల కేసుల్లో ఏ-2 నిందితుడిగా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి వ్యవహారం ఇలీవల పెద్ద రచ్చకు దారితీసింది. దేవాదాయ శాఖ ఉద్యోగిని శాంతి భర్తే ఆయనపై స్వయంగా ఆరోపణలు చేశారు. తన భార్యకు పుట్టిన బిడ్డకు కారణం ఆయనేనని.. డీఎన్ఏ టెస్టులు చేయించుకోవాలని సవాల్ చేశారు. దానిపై వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయసాయితో అంటకాగిన శాంతి పెట్టిన మీడియా సమావేశం కూడా వైరల్ అయింది. విజయసాయి వ్యవహారంలో అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. అన్నింటికీ డీఎన్ఏ టెస్టుతో ఫైనల్ క్లారిటీ వస్తుందని అనుకున్నారు. కానీ విజయసాయిరెడ్డి అందుకు అంగీకరించలేదు. అయితే శాంతి భర్త మాత్రం అదే డిమాండ్ చేస్తూ వచ్చారు. చివరికి విజయసాయిరెడ్డి సుద్దపూసలా సోషల్ మీడియాలో వివరణ ఇచ్చారు. శాంతి చేసిన అన్ని రకాల సాయాలు కూతురిగానే భావించి చేశానని తాను వారింటికి వెళ్లి బిడ్డను ఆశీర్వదించానని.. తన ఇంటికి వస్తే బట్టలు పెట్టానని .. అంతే తప్ప మరేమీ లేదని తండ్రికూతుళ్ల బంధం కలిపేశారు. డీఎన్ఏ టెస్ట్ చేయించుకోవడానికి అంగీకరించకుండా ఆ 67 ఏళ్ల రాజ్యసభ సభ్యుడు లేనిపోని బంధాలు కలుపుతూ వివరణ ఇచ్చి.. సోషల్ మీడియాలో ఇప్పటికీ ట్రోల్ అవుతూనే ఉన్నారుఇక ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సీరియల్ స్టార్ట్ అయింది. ఒక్క సారి జడ్పీటీసీగా గెలవడం మినహా ఇంకెప్పుడు ఎన్నికల్లో గెలవని దువ్వాడకు జగన్ ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారంటే.. వారిద్దరి సాన్నిహిత్యం అర్థమవుతుంది. చంద్రబాబు, పవన్కళ్యాణ్, అచ్చెన్నాయుడులను టార్గెట్ చేయడంలో దువ్వాడ శ్రీనివాస్ ముందుంటారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడేసే దువ్వాడ తీరే జగన్ని మెప్పించిందని చెబుతారు. అందుకే టెక్కలిలో అచ్చెన్నాయుడుపై పోటీకి వైసీపీ నుంచి ముగ్గురు నేతలు పోటీ పడినా జగన్ ఎమ్మెల్సీగా ఉన్న దువ్వాడ వైపే మొగ్గుచూపారంటారు. టికెట్ ప్రకటన సమయానికే దువ్వాడ మరో మహిళతో వివాహేతర బంధం పెట్టుకోవడం వారి కుటుంబంలో చిచ్చుకు కారణమైంది. ఆ విషయాన్ని ఆయన భార్య వాణీ స్వయంగా వెళ్లి జగన్ దగ్గర పంచాయతీ పెట్టారు. దాంతో శ్రీనివాస్ని కాదని.. దువ్వాడ వాణిని టెక్కలి ఇన్చార్జ్గా ప్రకటించారు ? కానీ జగన్ చివరికి దువ్వాడ శ్రీనివాస్కే టిక్కెట్ ప్రకటించారు. ఇండిపెండెంట్గా పోటీకి సిద్దమైన దువ్వాడ వాణిని బుజ్జగించారు. అంటే దువ్వాడ ఫ్యామిలీ సర్కస్ గురించి తెలిసి కూడా జగన్ ప్రోత్సహించారన్నమాట. దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం ఇప్పుడు మరింత ముదిరింది. దువ్వాడ శ్రీనివాస్కు పెళ్లయి ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక కూతురి పెళ్లి కూడా అయింది. ఆయన వయసు కూడా అరవై ఏళ్లకు దగ్గర పడింది. ఇలాంటి సమయంలో ఆయన మరో మహిళతో సహజీవనం చేస్తున్నానని చెప్పకనే చెప్తున్నారు. పైగా అది తప్పని భావించడం లేదంట.. తప్పుగా ఎవరైనా భావిస్తే క్షమించమని చేతులు జోడిస్తున్నారు. ఇప్పటికే దువ్వాడ కుటుంబ కథాచిత్రమ్ రచ్చకెక్కి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. దువ్వాడ ఇంటి ముందు ఆయన కుమార్తెల నిరసనతో మొదలైన వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. దాడులు, ప్రత్యారోపణలు వరకు వెళ్లింది. దువ్వాడ ఇంటి రచ్చ కంటిన్యూ అవుతూనే ఉంది. రెండ్రోజుల క్రితం దువ్వాడ ఇంటి ముందు ఆయన కుమార్తెలు ఆందోళన చేయగా.. ఇప్పుడు ఆయన భార్య వాణి వంతు. అర్థరాత్రి దువ్వాడ ఇంటికి పెద్దకుమార్తె హైందవితో కలిసి వాణి వెళ్లారు. ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడున్న వారు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దువ్వాడ బయటకు రావాలంటూ రాత్రంతా వాణి అక్కడే బైఠాయించి నిరసన చేపట్టారు.

# ఏపీలో పొట్టిశ్రీరాములు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు

**విజయవాడ :** తెలుగు రాష్ట్రాల్లోని విద్యాసంస్థల్లో విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు సాగిన ఉమ్మడి ప్రవేశాలకు జూన్ 2తో బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటుచేసిన ఈ రెండు విశ్వవిద్యాలయాలు హైదరాబాద్లోనే ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 2నాటికి పదేళ్లు పూర్తయినందున అవి ఏపీలో సేవలను నిలిపివేశాయి. ఈ క్రమంలో పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలు తెలంగాణ ప్రాంతానికి మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఈ రెండు యూనివర్సిటీలలో ఈ విద్యాసంవత్సరం వరకు ప్రవేశాలను కొనసాగించాలని ఏపీ ఉన్నత విద్యాశాఖ ఇటీవల లేఖ రాసింది. దీనిపై ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనరాలేదు. దీంతో ఏపీలోనూ తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. రెండు యూనివర్సిటీల ఏర్పాటుకు అయ్యే ఖర్చు ఎంత? మానవ వనరులు ఎంత అవసరమవుతాయి లాంటి అంశాలను ఉన్నత విద్యాశాఖ లెక్కలోకి తీసుకుంటుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఏపీలో శ్రీశైలం, కూచిపూడి, రాజమహేంద్రవరంలలో పీఠాలు ఉన్నాయి. వీటిద్వారా 200 మంది విద్యార్థులు వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఉన్న కేంద్రానికి దాదాపు 35 ఎకరాల స్థలం ఉంది. అక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది ప్రభుత్వ యోచనగా తెలుస్తోంది. ఏపీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలంటే దాదాపు 50 కోట్ల వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్లోని వర్సిటీలో ఉన్న కోర్సులన్నింటినీ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీచేయాల్సి ఉంటుంది. ఏపీలో కొత్తగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి రూ. 63.85 కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయిని ప్రభుత్వం అంచనా వేస్తోంది. వర్సిటీలో 50 బోధన పోస్టులు, 68 బోధనేతర పోస్టులు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు యూనివర్సిటీ ప్రారంభించాలంటే.. అద్దె భవనంలో ఏర్పాటు చేసి, నిర్వహించాల్సి ఉంటుంది. సార్వత్రిక విశ్వవిద్యాలయం తరఫున ఏపీలో 76 దూర విద్య కేంద్రాలు ఉన్నాయి. డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో కలిపి ప్రస్తుతం లక్షన్నర మంది చదువుతున్నారు. ఏటా సుమారు 16 వేల మంది ప్రవేశాలు పొందుతున్నారు. ఫీజుల రూపంలోనే వర్సిటీకి ఏపీ నుంచి రూ. 21 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ఏపీ స్టడీ సెంటర్లలో పని చేస్తున్న సిబ్బందికి జీతాల కింద రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 5.40 కోట్ల వరకు చెల్లిస్తోంది.



# 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు



**విజయవాడ :** ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ (ఎన్డీఏ) కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాదర్బార్ మొదలు పెట్టారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు.. వారి నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే మంత్రులు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారానికి రెండ్రోజులు? టైమ్ టేబుల్ వేసుకుని మరీ ఉంటున్నారు. సీఎం చంద్రబాబు సైతం తనవంతుగా వెళ్లి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు స్వీకరించారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నడుస్తున్న ఈ ప్రజాదర్బార్కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు పోటెత్తాయి. రాష్ట్ర నలుమూల నుంచి 50 రోజుల్లో 53 వేల ఫిర్యాదులు రావడం చర్చనీయాంశమైంది. ఇక ఈ ఫిర్యాదుల్లో ఎక్కువశాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉన్నట్లు తెలుస్తోంది. భూ ఆక్రమణ కేసులు, భూ కబ్జా కేసులే అధికంగా ఉన్నట్లు సమాచారం. అలాగే గ్రామాల్లోని త్రాగునీటి సమస్యలపైనా పెద్ద ఎత్తున ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది. మరోవైపు గత ప్రభుత్వంలో అక్రమ కేసులు, పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులపైనా అర్జీలు అందినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రజాదర్బార్లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను తీసుకొచ్చింది ఏపీ ప్రభుత్వం. ప్రజల నుంచి అందిన అర్జీని తక్షణమే ఆన్లైన్ చేసి.. సంబంధిత శాఖలకు వెంటనే పంపి సమస్య పరిష్కారం దిశగా అడుగులేస్తోంది. ఈ వ్యవస్థ కోసం పార్టీ కేంద్ర కార్యాలయంలోని సెకండ్ ఫ్లోర్లో ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు సీఎం ఆదేశాలతో మంత్రులు సైతం ప్రజా ఫిర్యాదులను చాలా సీరియస్గా తీసుకుంటున్నారు. వెంటనే పరిష్కారమయ్యే సమస్యలను గంటల్లోనే పూర్తి చేస్తున్నారు. మొత్తంగా.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థనే తీసుకొచ్చారు సీఎం చంద్రబాబు. ఇక ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలిస్తున్న అధికారులు? సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. టెక్నికల్గా ఉన్న వారిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఫోకస్




**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్లో నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఫోకస్ పెట్టింది. గత ఐదేళ్లు పార్టీ నేతలు పని చేసిన విధానం, ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన పనులు, భవిష్యత్ అవసరాలు, ఇలా చాలా అంశాలను బేరీజు వేసుకొని ఈ పోస్టులు భర్తీకి కసరత్తు చేస్తోంది. మరో వారం పదిరోజుల్లో ఈ జాబితాపై క్లారిటీ రానున్నట్టు సమాచారం. పార్టీలో ఎవరికి ఏ నామినేటెడ్ పోస్టు వస్తుందనే విషయం పక్కన పెడితే... అసలు కూటమి పార్టీల మధ్య సర్దుబాటు మెయిన్ టాస్క్గా ఉంది. కూటమి ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు ఎన్ని విమర్శలు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రత్యర్థులు ఎంతలా కవ్వించినా కూటమి నేతలు ఎక్కడా గీత దాటకుండా పని చేస్తూ వచ్చారు. ఇకపై కూడా అలానే ఉండాలన్న ఆలోచనతో ఉన్నారు. సీట్ల సర్దుబాటు నుంచి మంత్రి వర్గ విస్తరణ వరకు అన్ని విషయాల్లో సామరస్యపూరకంగా ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటి వరకు చేసిందంతా కూడా కీలకమైన నేతల మధ్య పదవీ పంపకాలు కాబట్టి అంతా సర్దుబాటు చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఈ నామినేటెడ్ పోస్టు భర్తీ పార్టీలో చాలా కీలకం. భవిష్యత్ నాయకత్వాన్ని తయారు చేసుకోవాడనికి ఇదో వేదికగా ఉపయోగపడుతుంది. అందుకే దీని కోసం అన్ని పార్టీల నేతలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తుంటారు. అధికారంలో తమ పార్టీ ఉంటే ఏదో ఒక నామినేటెడ్ పదవి తెచ్చుకుంటే భవిష్యత్ లీడర్గా ఎదగవచ్చని ఆశపడుతుంటారు. అలాంటి ఆశలు ఉన్న నేతలు వేలల్లో ఉంటారు. కానీ నామినేటెడ్ పదువులు మాత్రం చాలా తక్కువగానే ఉంటాయి. ఒకే పార్టీ అధికారంలో ఉంటే మాత్రం అన్నీ ఒకే పార్టీకి వస్తాయి. కాబట్టి అక్కడ సమస్య ఉండదు. కానీ ఏపీలో పరిస్థితి పూర్తిగా భిన్నం. ఇక్కడ మూడు పార్టీలతో కలిసిన కూటమి అధికారంలో ఉంది. అందుకే ఇక్కడ నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎక్కువ సీట్లు గెలుచుకున్న టీడీపీకి అధిక భాగం దక్కనున్నాయి. తర్వాత జనసేనకు ప్రయార్టీ ఉంటుంది. అనంతరం బీజేపీ నేతలకు ఇస్తారు. అయితే అది ఏ నిష్పత్తిలో ఉండాలనేది అసలు మేటర్. దీని కోసం మూడు పార్టీల అగ్రనేతలు ఓ ఫార్ములా ఆలోచించారని సమాచారం అందుతోంది. ఎక్కువ సీట్లు ఉన్న టీడీపీకి 60 శాతం వరకు నామినేటెడ్ పదువులు ఇవ్వాలని తర్వాత జనసేనకు 25 శాతం, బీజేపీకి 15 శాతం పదవులు కట్టబెట్టాలని ఆలోచన చేస్తున్నారని ప్రచారం నడుస్తోంది. అలాంటిదేమీ లేదని టీడీపీ నుంచి అందుతున్న సమాచారం. బీజేపీ, జనసేనకు 20 శాతం వరకు మాత్రమే పదవులు ఇస్తారని అంటున్నారు. పోటీ చేసిన సీట్ల ప్రకారమే ఈ పంపిణీ ఉంటుందని అంటున్నారు. మరో వారం పదిరోజుల్లోనే వీటన్నింటిపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. అప్పటి వరకు ఎవరికి నచ్చిన నెంబర్ వాళ్లు చెబుతుంటారని వాటిని నమ్మొద్దని కేడర్కు సూచిస్తున్నారు. టీడీపీ అధినేత మాత్రం ఎంత శాతం తమకు దక్కినా వాటిలో పార్టీకి ఆయా నేతలు చేసిన పనితీరు ఆధారంగానే పదవులు ఇవ్వాలని భావిస్తున్నారట. ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించారని వివిధ మార్గాల్లో సమాచారం తెప్పించుకుంటున్నారని ఆయా ప్రాంతాల్లో కేడర్ అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నారని అంటున్నారు. ఆ ప్రాంతాల్లో పార్టీ కోసం ఎవరు ఎలా కష్టపడ్డారు... ఎవరికి ఎలాంటి పదవి ఇస్తే పార్టీకి మేలు జరుగుతుందనే విధంగా అభిప్రాయప సేకరణ జరుగుతోందట. వీలైనన్ని మార్గాల్లో రిపోర్ట్స్ తెప్పించుకుంటున్నారని అంటున్నారు. గత ఎన్నికల్లో ఈ మార్గాల ద్వారానే సమాచారం తెప్పించుకొని ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎంపిక చేశారు. విజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు కూడా అదే స్ట్రాటజీని అనుసరిస్తున్నారు చంద్రబాబు నామినేటెడ్ పదవుల భర్తీ కోసం రాష్ట్ర స్థాయి లీడర్ నుంచి క్షేత్రస్థాయిలో పని చేసే కేడర్ వరకు అందరి అభిప్రాయాలు తీసుకుంటున్నారట. అదే టైంలో కూటమి నేతలతో కూడా మాట్లాడుతున్నారని తెలుస్తోంది. పని తీరుతోపాటు ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను కూడా పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ పోస్టుల భర్తీ ఒకేసారి కాకుండా విడతల వారీగా చేపట్టాలని ఆలోచన చేస్తున్నారు. మొత్తానికి ప్రక్రియను మాత్రం వారం పదిరోజుల్లో ప్రారంభించాలని చూస్తున్నారు.

# బెజవాడలో భారీగా పెరుగుతున్న వరద




**విజయవాడ :** క్రిష్ణా నదిలోకి వరద ప్రవాహం భారీగా చేరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. వరద ప్రవాహం పెరిగితే ఇబ్బందులు ఎదురయ్యే జిల్లాలైన ఎన్టీఆర్, కృష్ణ, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఎప్పటికప్పుడు కృష్ణా వరద ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేస్తున్నట్లు విపత్తు నిర్వహణ సంస్థ ఎండి రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కృష్ణానది మీద ప్రాజెక్టులోని నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు, లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు బోట్లు, మోటార్ బోట్లు, స్టీమర్లతో నదిలో ప్రయాణించవద్దని హెచ్చరించారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, స్నానాలకు దిగడం, చేపలు పట్టడం వంటి పనులు చేయకూడదని స్పష్టం చేశారు. పశువులు, గొర్రెలు, మేకలు వంటి జంతువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరోసారి ఆయన స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా నదుల వరద ప్రవాహంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని కీలక ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరుతోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద స్వల్పంగా కృష్ణానది వరద పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 2.67 లక్షల క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. సుంకేసుల వద్ద ఇన్ ఫ్లో 47,600 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 47,235 క్యూసెక్కులు ఉంది. శ్రీశైలం డ్యామ్ వద్ద ఇన్ ఫ్లో 3.32 లక్షల క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 2.70 లక్షల క్యూసెక్కులు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద ఇన్ ఫ్లో 3.51 లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2.70 లక్షల క్యూసెక్కులు నీటి నిల్వ ఉంది. పులిచింతల వద్ద ఇన్ ఫ్లో 2.50 లక్షల క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2.88 లక్షల క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. గోదావరి కృష్ణా నదుల వరద హెచ్చుతగ్గుల దృష్ట్యా పూర్తిస్థాయిలో వరద తగ్గేంతవరకు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అత్యవసర సహాయం కావాల్సిన వారి కోసం అధికార యంత్రాంగం ప్రత్యేకంగా నెంబర్లను కేటాయించింది. వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు.. అత్యవసర సహాయం కోసం కొన్ని ఫోన్ నెంబర్లను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. సహాయం కావాలనుకునే వాళ్ళు 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండి కూర్మనాద్ వెల్లడించారు. ప్రజలు కూడా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రభుత్వ అధికారులు జారీచేసే సూచనలను పాటించాలని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శించి ప్రమాదానికి గురి కావద్దని ఆయన స్పష్టం చేశారు.

# మాజీ భర్త ఇంటి ముందు ధర్నా



**హైదరాబాద్ :** తన కూతురి కోసం మాజీ భర్త ఇంటి ముందు ఆందోళన చేపట్టింది ఓ తల్లి. ఓయూ పీఎస్ పరిధి హబ్సిగూడ రవీంద్ర నగర్ లో ఈ ఘటన చోటు చేసుకుంది.పావని, నవీన్ రెడ్డి లకు గత 7 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లయిన సంవత్సరం తర్వాత భార్య భర్తలు విడిపోయారు. పావని తన తల్లి దగ్గర ఉంటోంది. భార్య భర్త లకు కోర్టులో కేసు నడుస్తుంది. ఈ నేపథ్యంలో కూతురు ఒకరోజు తన వద్ద ఉంచుకుంటాను అని చెప్పి తన వద్దే ఉంచుకున్నాడు తండ్రి. వారం గడుస్తున్నా తన కూతురిని తనకు ఇవ్వక పోవడం తో భార్య, భర్త ఇంటి ముందు బంధువులతో కలిసి ఆందోళన చేపట్టింది. ఈ ఇన్ని రోజులుగా తనే వద్ద ఉన్న 5 సంవత్సరాల చిన్నారి నీ ఒక్క రోజు తన వడా ఉంటుందని చెప్పిన భర్త పాపను అప్పింగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. పాప పేరు మీద 4 ఎకరాల భూమి కోసం భర్త ఇలా చేస్తున్నాడని భార్య ఆరోపించింది. కోర్టు తీర్పు ప్రకారం బిడ్డ తన వద్దే ఉండాలని, కానీ నా కూతుర్ని నాకు దూరం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా తన కూతురిని అప్పగించాలని వేడుకుంటుంది

# నామినేటెడ్ పదవుల కోసం ..చివరి స్థాయి ప్రయత్నాలు




**నల్గొండ :** పదేళ్ళ తర్వాత కాంగ్రెస్ అధికారాంలోకి వచ్చింది. దాంతో కాంగ్రెస్ నేతలంతా తెగ ఖుషీ అవుతున్నారు. కష్టకాలంలో పార్టీతోనే ఉండి కష్టపడిన నేతలు పార్టీ పదవులతోపాటు, నామినేటెడ్ పదవులపై అశలు పెట్టుకున్నారు. మొదటి విడతలో 37 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇక రెండో విడత కార్పొరేషన్ పదవుల పంపకానికి రంగం సిద్ధమైంది. ఈసారి కీలకమైన కార్పొరేషన్ పదవుల భర్తీతో పాటు.. ప్రభుత్వం కొత్తగా రైతు, విద్య కమిషన్లు ఏర్పాటు చేయనుంది. వాటితో పాటు బీసీ కమిషన్ భర్తీకి ఇప్పటికే కసరత్తు మొదలైంది. ఆ క్రమంలో ఆశావహులు ఎవరి స్థాయిలో వారు లాబీయింగ్ మొదలుపెట్టారు.రాష్ట్ర సర్కార్ ఇప్పటికే పలువురు కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టింది. మొదటి విడత కింద 37 కార్పొరేషన్‌లకు ఛైర్మన్‌లను నియమించింది. అందులో భాగంగా మహిళా, ఫైనాన్స్ కమిషన్‌లకు చైర్మన్లను, మెంబర్లను కూడా వేసింది. ఇక జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీలను ఇతర పదవులను పార్టీ నేతలకు కట్టబెట్టింది. రెండో విడత కింద మరికొన్ని పదవులను హస్తం పార్టీ నేతలకు వరించనున్నాయి.రెండో విడత కింద భర్తీ చేసే పదవులపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు కూడా పూర్తి చేసినట్లు గాంధీ భవన్ లో జోరుగా చర్చ జరుగుతోంది. మొదటి విడతలో చోటు దక్కని సామాజిక వర్గాలకు, నేతలకు ఈసారి బెర్త్ పక్కా అనే టాక్ పార్టీలో బలంగా వినిపిస్తుంది. ఈసారి చాలా కీలకమైన కార్పొరేషన్ పదవులు భర్తీ కానున్నట్లు పార్టీ నేతలు అంటున్నారు. అందులో ఆర్టీసీ కార్పొరేషన్, సివిల్ సప్లై కార్పొరేషన్, మూసీ కార్పొరేషన్, హెచ్‌ఎండిఏ, రెడ్కో, మెడికల్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్, హాకా, రైతు కమిషన్, విద్యా కమిషన్, స్టేట్ కౌన్సిల్ చైర్మన్, యాదవ, కూర్మ కార్పొరేషన్, చేనేత కార్పొరేషన్, షిప్ అండ్ గోట్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సెట్విన్ చైర్మన్, స్కిల్ డేవలప్‌మెంట్ కార్పొరేషన్‌లతో పాటు మరికొన్ని పదవులు భర్తీ అవుతాయంటున్నారు.రెండో విడతలో భర్తీ చేసే నామినేటెడ్ పదవులను దక్కించుకోడానికి ఇప్పటికే వందలాది మంది నేతలు పార్టీ ముఖ్యనేతల దగ్గర లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఐతే ఇప్పటికే సీఎం కసరత్తు చేసిన జాబితాలో రైతు కమిషన్ చైర్మన్ గా సీనియర్ నేత, జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, విద్య కమిషన్ చైర్మన్ గా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్లు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇక ఈ రెండు కమిషన్‌లలో చెరో నలుగురు చొప్పున 8 మందిని మెంబర్లుగా నియమించనున్నారంట. ఇప్పటికే వారి పేర్లు కూడా ఖరారయ్యాయని సీఎం విదేశీ పర్యటనకు ముగిసిన తర్వాత ప్రకటిస్తారంటున్నారు.ఇక ప్రస్తుతం వున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యుల పదవీకాలం వచ్చే నెలతో ముగియనుంది. ఐతే వారిని కొనసాగించకుండా కొత్త వారికి అవకాశం ఇస్తారంటున్నారు. అందులో భాగంగానే బీసీ కమిషన్ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నేత నిరంజన్ పేరు పరిశీలిస్తున్నారంట. మరో ముగ్గురిని సభ్యులుగా నియమించనున్నారు. అలాగే సమాచార హక్కు చట్టం, హ్యూమన్ రైట్ కమిషన్ లను కూడా భర్తీ చేయాలనీ చూస్తుంది సర్కార్. ఇప్పటికే ఈ రెండిటికి దరఖాస్తులను కూడా స్వీకరించింది. ఈనెలలోనే వీటిని భర్తీ చేస్తానంటున్నారు.రెండో విడతలో కార్పొరేషన్ పదవులతో పాటు వివిధ కమిషన్ లకు చైర్మన్ లను మెంబర్లను వేయడానికి సర్కార్ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తుంది. ఐతే ఈ సారి భర్తీ చేసే పదవులకు పార్టీ నేతలతోపాటు పార్టీ మారి కాంగ్రెస్ లో జయిన్ అయిన ఎమ్మెల్యేలు, పార్టీ సినియర్ నేతలు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్ట్ లు పోటీ పడ్తున్నారు. రెండో జాబితాలోఎంతమందికి ఛాన్స్ ఉంటుందోనని అందరు ఆసక్తిగా చూస్తున్నారు. ఏదేమైనా సిఎం విదేశి పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు రాగానే రెండో జాబితా పక్కా అంటున్నారు సీనియర్ నేతలు

# ఫోన్ మాట్లాడుతూ.. హీటర్ సంకలో పెట్టుకొని..విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ఖమ్మం నగరం ప్రకారం నగరంలోని కాల్వవడ్డు హనుమాన్ గుడి సమీపంలో నివసించే దోనేపూడి మహేష్ బాబు (40) కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటాడు. తన పెంపుడు కుక్కకు స్నానం చేయించాలని నీటిని వేడిచేసేందుకు హీటర్ను పెట్టి ఫోన్ రావటంతో ఫోన్ మాట్లాడుతూ హీటర్ను నీటిలో బదులు సంకలో పెట్టుకున్నాడు. దీంతో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై అతను అక్కడే పడిపోయాడు.గమనించిన తన కుమార్తె కేకలు వేయటంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు స్విచాఫ్చేసి మహేష్ బాబును ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించిఅప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తీటౌన్ పోలీసులు తెలిపారు.

# రోజురోజుకీ పెరుగుపోతున్న వీధి కుక్కల బెడద



**మచిలీపట్నం :** మచిలీపట్నంలో స్థానిక 2వ డివిజన్ మాచవరం రత్న హైస్కూల్ రోడ్డులోని దాదాపు పది కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి రోడ్డు మీద నడవాలంటే ప్రజానీకం భయభ్రాంతులకుగురవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# దూసుకెళ్తున్న హైడ్రా

**హైదరాబాద్ :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్, అస్సెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ.. సింపుల్‌గా హైడ్రా.. హైదరాబాద్ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది ఈ ఏజెన్సీని.. ఇప్పుడీ హైడ్రా రంగంలోకి దిగింది. అక్రమార్కుల గుండెల్లో బుల్డోజర్లను పరుగులెత్తిస్తోంది. ఆక్రమణ అని కన్ఫామ్ అయితే చాలు.. సీన్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. ఆక్రమణలను మీరు కూలుస్తారా? మమ్మల్ని కూల్చమంటారా? అని వార్నింగ్ ఇస్తోంది.తెలంగాణ రాష్ట్ర ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా? దూసుకెళ్తోంది. హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాల్లో కొరడా ఝుళిపిస్తోంది. చెరువులు, కబ్జా స్థలాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతోంది. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తూ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చురుకుగా వ్యవహరిస్తూ ఫుల్ స్పీడుమీదున్నారు.ఇక రాజేంద్రనగర్ పరిధి శివరాంపల్లిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసింది హైడ్రా. చెరువును ఆక్రమించిన కబ్జాదారులు ఏకంగా ప్లాట్లు వేసి చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేసింది. మొత్తం 5 బిల్డింగులతో పాటు ఓ 25 కాంపౌండ్ వాల్స్‌ను జేసీబీ సాయంతో హైడ్రా కూల్చేసింది. అక్రమ నిర్మాణాల తొలగింపును ఎవరు అడ్డుకోకుండా పోలీసుల భారీగా బందోబస్తు నడుమ ఈ కూల్చివేతలు జరిగాయి.అక్రమ కట్టడాలు రాజకీయ నాయకులకు చెందినవైనా సరే? ఏమాత్రం వెనక్కి తగ్గట్లేదు హైడ్రా. బిల్డింగులను కూల్చివేస్తుంటే అడ్డుకోవడానికి వచ్చిన బహదూర్‌పుర ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. అంతేకాదు స్థానిక కార్పొరేటర్‌తో పాటు పలువురుని అదుపులోకి తీసుకుని మరీ? కూల్చివేతలను కంటిన్యూ చేశారు అధికారులు.అంతకుముందు చందానగర్, కుత్బుల్లాపూర్‌లోని అక్రమ కట్టడాలను సైతం ఇలానే కూల్చేశారు. చెరువులు, కబ్జా భూములపై నిర్మాణాలు జరిపారన్న కంప్లైంట్ వస్తే చాలు? వెంటనే అక్కడ వాలిపోతున్నారు హైడ్రా అధికారులు. పెద్ద చిన్నా ఏం లేదు?అక్రమ నిర్మాణాలు చేస్తే అందరూ ఒకటేనన్న ప్రభుత్వ ఆదేశాలతో మాంచి దూకుడు మీదున్నారు.హైడ్రా డిపార్ట్‌మెంట్ మార్షల్స్.. ఆఫీఈ బృందాలు.. ఎక్స్‌కవేటర్లు.. పోలీసులు.. అవసరమైతే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్




నేరుగా అక్కడికి వెళుతున్నారు. ఫిర్యాదు రాగానే.. ముందుగా స్థానిక అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత రెవెన్యూ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్స్ వద్ద ఉన్న మ్యాపులు, సాటిలైట్ పిక్స్‌తో కంపేర్ చేసుకుంటున్నారు. ఒక్కసారి అక్రమ కట్టడమని తేలిందా.. దాని పని ఖతం.. నిజానికి గతంలో నోటీసులతోనే వ్యవహారం నిలిచిపోయేది. కానీ ఇప్పుడలా కాదు.. గంటల్లోనే వ్యవహారం ముగిసిపోతుంది.ప్రభుత్వ విభాగాలన్ని ఏకతాటిపైకి రావడంతో.. అన్ని పనులు చకాచకా జరిగిపోతున్నాయి. దీంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది. చెరువులు, నాలాలు, మూసీ పరివాహక ప్రాంతాల్లో,, ప్రభుత్వ స్థలాల్లో వేసిన లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఇప్పుడు ఆందోళనకరమే అని చెప్పాలి.నిజానికి హైడ్రా అనే దానిని చాలా మంచి ఆశయంతో తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇది ఓ స్వతంత్ర వ్యవస్థ. జీహెచ్ఎంసీ పరిధితో పాటు శివారులోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలన్ని దీని కిందకు వస్తాయి. ఈ పరిధిలో ఎలాంటి విపత్తు జరిగినా రక్షణ చర్యలు చేపట్టే బాధ్యత హైడ్రాకు ఉంటుంది. అది ఎలాంటి ప్రమాదమైనా కావొచ్చు. వాహన ప్రమాదాలను మొదలు పెడితే.. అగ్ని కావొచ్చు, వరదలు కావొచ్చు.. ఇలా ప్రమాదమేదైనా హైడ్రా రంగంలోకి దిగుతుంది. ఎట్ ది సేమ్ టైమ్.. అలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా హైడ్రాదే.. దీనికి కావాల్సిన నిర్ణయాలు తీసుకునే హక్కు కూడా ఉంది హైడ్రాకు.. అందుకే అలాంటి ప్రమాదాలు, నష్టాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది.

# సాగర్ కు పర్యాటకులు..ట్రాఫిక్ జామ్



**నల్గొండ :** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కు పర్యాటకుల అధిక సంఖ్యలో రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు వరుసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో ఈరోజు సాగర్ ను చూసేందుకు వేలాది మంది పర్యాటకులు మోటార్ వెహికల్ లో కార్లలో తరలివచ్చారు దీంతో ఎక్కడికి అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది సాగర్ లోని దారులను పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. పంప్ హౌస్ వద్ద పర్యాటకుల సంఖ్య ఎక్కువ కావడంతో పోలీసులు వారిని పంపించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు

# దున్నపోతుల గండి ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి ఉత్తమ్




**నల్లగొండ :** అడవిదేవుల పల్లి మండలం దున్న పోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా మిర్యాలగూడ ప్రజలతో నాకు అనుబంధం ఉంది ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సేవ చేశాం. ఎంతో కాలంగా లిఫ్టు లు పెండింగ్ ఉన్నాయి. సాగర్ నిండటం శుభ పరిణామం, రెండు పంటలకు నీటికి కొదవ లేదు. సాగర్ పరిదిలో పెండింగ్ కాల్వల పనులకు వెంటనే నిధులు కేటాయించి, నూటికి నూరు శాతం పూర్తి చేస్తాం. 490 కొట్ల నిధులు వెంటనే విడుదల చేస్తాం. వచ్చే స్వాతంత్ర దినోత్సవం నాటికి 5 లిఫ్ట్ ల పనులు పూర్తి చేయాలి. ప్రభుత్వము నుండి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకుంటాం. అదికారులు చిత్త శుద్ధి తొ పనిచేయాలని అన్నారు.

# మద్యం మత్తులో ఎస్సై కార్ డ్రైవింగ్.... పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**ఖమ్మం :** మద్యం మత్తులో ఓ ఎస్సై కార్ డ్రైవింగ్ చేస్తూ అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మహబూబాద్ జిల్లా సీరోల్ మండలం ఎస్సైగా పనిచేస్తున్న విజయ్ కుమార్ రాత్రి స్నేహితులతో కలిసి మహబూబాబాద్ వైపు నుంచి ఖమ్మం వైపుకు వస్తున్నారు. మద్యం సేవించి కార్ డ్రైవింగ్ చేస్తున్న ఎస్సై మార్గమధ్యలోని ములకలపల్లి వద్ద ఓ ఆటో ను ఢీ కొట్టి ఖమ్మం రూరల్ మండలం కాచిరాజు గూడెం వద్ద కార్ అదుపుతప్పి పంట పొలంలోకి పల్టీ కొట్టింది ఈ ఘటనలో ఎస్సై నుదుటి భాగాన బలమైన గాయమైనట్లు తెలిసింది.కారులో ఉన్న తోటి స్నేహితులు సహాయంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది


# డ్రగ్స్ మత్తులో జోగుతున్న యువత

**హైదరాబాద్ :** రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను కట్టడి చేసేందుకు పోలీసులు ఎంత నిఘా పెట్టి.. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏదో ఓ చోట ఇంకా వాటి మాట వినిపిస్తూనే ఉంది. కొంతమంది అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చెడు వ్యసనాలకు వినియోగిస్తున్నారు. డార్క్వెబ్ ద్వారా డ్రగ్స్ను ఆర్డర్ చేసి డెలివరీ తీసుకుంటున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ను రెడ్ హ్యాండెడ్ గా తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.ఖమ్మంలో డ్రగ్స్ ఆనవాళ్లు కలకలం రేపుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా మొట్ట మొదటి సారిగా ఖమ్మంలో హెరాయిన్ పట్టుబడింది. ఓ టెకీ అసోం నుంచి దీన్ని స్పీడ్ పోస్ట్ లో తెప్పించుకోవడం గుబులు రేపుతోంది. అయితే అతను ఒక సాఫ్ట్ వేర్ ఇంజినీర్ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. హెరాయిన్ కు అలవాటు పడిన ఆ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ తరచుగా డ్రగ్స్ తెప్పించునేవాడన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఖమ్మం నగరం రోటరీ నగర్ రెండో లైన్ లో నివాసం ఉంటున్న ఆ టెకీ తాజాగా అసోం నుంచి స్పీడ్ పోస్ట్ లో తెప్పించుకున్న హెరాయిన్ పోలీసులకు దొరికింది. ఖమ్మం టూ టౌన్ పోలీసులు ఆ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా డ్రగ్స్ కు బానిసగా మారిన ఆ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ నిత్యం వాటితోనే సహ జీవనం చేసేవాడని స్పష్టంగా తెలుస్తోంది. అసోం నుంచి ఖమ్మం నగరానికి డ్రగ్స్ డెలివరీ అవుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు డార్క్ వెబ్ ఆపరేషన్ ద్వారా స్పీడ్ పోస్ట్ లో వచ్చిన హెరాయిన్ ను రెడ్ హ్యాండెడ్ గా స్వాధీనం చేసుకున్నారు.డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ కోసం ఆర్డర్ చేస్తున్నాడనే సందేహం కలిగి అతడి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. జులై 31న డార్క్ వెబ్ ద్వారా రాష్ట్రానికి డ్రగ్స్ వస్తున్నట్లు పక్కా సమాచారంతో అతనిపై దృష్టిపెట్టారు. అసోం నుంచి స్పీడ్ పోస్టులో ఖమ్మం జిల్లాకు



మాదక ద్రవ్యాలు వస్తున్నట్లుగా సమాచారం తెలుసుకున్నారు. ఈ నెల 8వ తేదీన డ్రగ్స్ డెలివరీ చేస్తున్న క్రమంలో టీజీ న్యాబ్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడి చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. న్యూస్ పేపర్లో డ్రగ్స్ చుట్టి ప్లాస్టర్ అంటించి డెలివరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కొనుగోలు చేసిన సమయంలో క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరిపినట్లు టీజీ న్యాబ్ పోలీసులు గుర్తించారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి, తన తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.ప్రధానంగా యువతే లక్ష్యంగా డ్రగ్స్ వ్యాపారులు అంచెలంచెలుగా తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. డ్రగ్స్ విషయానికి వస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా పెద్ద ఎత్తున గంజాయి తరలింపు సర్వసాధారణంగా మారింది. ఛత్తీస్‌గఢ్ తో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్న సందర్భాలు అనేకం. ఏకంగా ఆర్టీసీ బస్సులో ఇద్దరు మహిళలు చాక్లెట్ల రూపంలో గంజాయి తీసుకెళ్తుండగా పట్టుబడ్డారు.

# మంత్రి ఉత్తమ్ ను అడ్డుకున్నబాల్నేపల్లి చిట్యాల గ్రామస్థులు



**నల్గోండ :** నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం చిట్యాల వద్ద ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని బాల్నేపల్లి చిట్యాల గ్రామస్తులు అడ్డుకున్నారు. టైల్ పాండ్ ప్రాజెక్టు నిర్వాసితుల కింద తమకు ఇల్లు నష్టపోయిన పరిహారం తదితర సమస్యలు నెరవేర్చకపోవడంతో అడ్డగించారు. తాగునీరు అందించడం లేదని ఇళ్లల్లోకి పాములు తేళు వస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేసారు.

# పెద్ద అంబర్ పేటలో బోనాలు



**ఎల్బీ నగర్ :** పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాలు మరియు బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. , ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మరియు స్థానిక కౌన్సిలర్ కృష్ణారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారికి మొక్కు సమర్పించినట్లు ఎంపీ చామల కిరణ్ రెడ్డి తెలిపారు..

# అజీర్తికి చెక్ పెట్టే పుచ్చకాయ

వేసవికాలం వస్తోందంటే చాలు ప్రపం చంలో అందరికీ గుర్తుకొచ్చేది పుచ్చ కాయ. దీన్ని ఖర్బూజ అని కూడా పిలు స్తారు. ఈ కాయ నిండా నీరే ఉంటుంది కాబట్టి ఇంగ్లీష్‌లో దీనికి వాటర్ మెలోన్ అనే పేరు స్థిరపడింది. తాపాన్ని చల్లార్చే చలవగుణం దీనికి ఉంది. దీనిలో ఔషధగుణాలు కూడా ఉన్నాయి. జీర్ణప్రక్రి యకు బాగా దోహదపడ డం దీని లక్షణం.పుచ్చపండు వంటింటి వైద్యంలో ఎలా ఉప యోగపడగలదో చూద్దాం.మూత్రవ్యాధులన్నిటినీ నివారించాలంటే పుచ్చపం డును వేసవి కాలంలో తరచుగా తింటూండాలి. పుచ్చకాయకు బాగా చలవ చేసే గుణముంది. ఇది వేసవిలో మాత్రమే లభిస్తుంది. ఎండదెబ్బ తగల కుండా చేస్తుంది. ఎండవేడిమికి ఇది ఔషధం లాగా పనిచేస్తుంది. ఇక జీర్ణశక్తికి పుచ్చకాయ చాలా మంచిది. నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ శరీర జీర్ణ ప్రక్రియను సులువుగా, సజావుగా పనిచే యిస్తుంది. పుచ్చకాయ కడుపు నొప్పి, విరేచనాలను పోగొడుతుంది. పుచ్చ పండు తింటే అజీర్ణంతో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది. ఇంకెందుకు ఆలస్యం. మీరు కూడా




పుచ్చకాయను వేసవిలో లాగించేయండి. వడదెబ్బ తగలకుండా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# షుగర్ ఎక్కువైతే అనర్థమే

రక్తంలో సుగర్ ఎక్కువయితే అది శరీరంలోని కణాల నుంచి నీటిని తీసుకుంటుంటుంది. దాంతో డిహైడ్రేషన్ కలుగుతుంది. అందుకే రక్తంలో సుగర్ ఎక్కువగా ఉన్నవాళ్లు డయాబెటిక్స్ దాహంతో బాధపడుతుం టారు. డయాబెటిస్ ఉన్నవాళ్లు ఆకలితో ఎందుకు అలమటిస్తుంటారంటే ఎంత తిన్నా జీర్ణమైన ఆహారం కణాలకు చేరదు కాబట్టి. వాటితోబాటు మూత్రానికి ఎక్కువసార్లు పోతున్నా, కారణం లేకుండా బరువు తగ్గిపోతున్నా, అలసట, నీరసం ఎక్కువగా ఉన్నా చూపు అలికినట్లున్నా, గాయాలై త్వరగా మానకుండా ఉన్నా, కాళ్లుచేతుల్లో తిమ్మిర్లుగా ఉంటున్నా, వయసు 30 దాటుతున్నా రక్తపరీక్షల ద్వారా డయాబెటిస్ ఉన్నది లేనిది నిర్ధారణ చేసుకోవాలి. వ్యాధి ఉంటే వైద్యుల సలహా మేరకు జాగ్రత్తపడాలి.డయాబెటిస్‌ని అదుపులో ఉంచుకోవాలి. లేకపోతే అనర్థాలు అధికం. డయాబెటిస్ జబ్బు కాదు గానీ అన్ని జబ్బులకు మూలం, అదుపులో ఉంచు కోకపోతే. ఆర్టెరీస్ రక్తనాళాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా సన్నటి రక్తనాళాలకు ముప్పు ఉంటుంది. ఈ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రమాదం ఎక్కువ. అలా రక్తనాళాలలో కొవ్వు పేరుకుపోవడంవల్ల హార్ట్ ఎటాక్ లేక స్ట్రోక్‌లాంటివి రావచ్చు. పెద్ద రక్తనాళాలు మూసుకుపోయే ప్రమాదం ఉంది. కాళ్లలో రక్తనాళాలు దెబ్బతిని, గాంగ్రిన్ లాంటివి కలిగే ప్రమాదాలున్నాయి. అధిక రక్తపోటు కలగవచ్చు. అదీ గుండెకి ప్రమాదమే కదా? ఆహార నియంత్రణ చాలా అవసరం. కొవ్వు పదార్థాల్ని తగ్గించివేయాలి. కడుపునిండా తినకూడదు. ఖాళీ కడుపుతో ఉండకూడదు. నాలుగు గంటలకోసారి కొద్దికొద్దిగా తీసుకోవాలి. డయాబెటిస్‌తో నరాలు దెబ్బతింటాయి. నరాల మీద ఉండే పొర దెబ్బతినడంతో న్యూరోపతి వస్తుంది. రక్తనాళాలు దెబ్బతింటే, వాస్క్యులోపతి అంటారు. పాదవాటి రక్తనాళాలు దెబ్బతిన్నట్లే, పాదవాటి నరాలు దెబ్బతింటాయి. అందుకే పాదాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వారానికొకసారైనా గోరు వెచ్చని నీటిలో పాదాల్ని ఉంచి, తర్వాత శుభ్రంగా తుడవాలి. డయాబెటిస్‌వల్ల ఒక్కోసారి మూత్ర పిండాలు పూర్తిగా దెబ్బతినవచ్చు.డయాబెటిక్ వల్ల రెటినోపతి రావచ్చు.

# క్షయ వ్యాధికి అప్రమత్తతే మందు





క్షయ (టీబీ) ఇదో మహమ్మారి రోగం. ఇట్టే సోకే అంటువ్యాధి. దీనికి చిన్నా పెద్ద, ముసలిముతక అనే తేడా ఉండదు. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, తుంపర్లతో మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్ అనే బ్యాక్టీరియా చేరుతుంది. దీనికి శరీరంలోని ఈ భాగం..ఆ భాగమనే తేడా లేదు..ఎక్కడైనా వచ్చి చేరుతుంది. తీవ్రంగా బాధిస్తుంది. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే.. మహమ్మారిని తరిమికొట్టేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. క్షయ(టీబీ) నియంత్రణ డే సందర్భంగా వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు తగ్గించుకునే తీరు మీకోసం.క్షయ సోకే విధానం...క్షయ ప్రమాదకరమైన వ్యాధి. ఇది ఒకరి నుంచి మరొకరికి చాలా సులువుగా సోకుతుంది.ఇది ఎక్కువగా ఊపిరితిత్తులకు అతి దగ్గర్లో చేరుతుంది. మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్ ద్వారా ఈ వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలిలో వ్యాపించి వ్యాధిని విస్తరిస్తాయి. ఎక్కువగా ఎయిడ్స్‌తో బాధపడే వారికి వ్యాధి తప్పనిసరిగా వస్తుందని నిపుణులు చెబుతున్నారు. వ్యాధి సోకితే...వ్యాధి సంక్రమిస్తే అనేక కారణాలతో రోగి నుంచి లక్షణాలు వెలువడే అవకాశాలు ఉంటా యి. వాటిని తక్షణమే గుర్తించే అవకాశమూ ఉం ది. మూడు వారాలకు మించి అధికంగా దగ్గినప్పుడు ఈ వ్యాధి సోకినట్లు అంచనాకు రావొచ్చు. దీనికితోడు సాయంత్రం సమయంలో జ్వరం సైతం బాధిస్తుంది. ఆహారం తినే పరిమాణం, శరీర బరువు తగ్గిపోతాయి. విపరీతమైన ఛాతి నొప్పితో పాటు తెమడలో రక్తం పడే అవకాశాలు ఉంటాయి. నిర్ధారణ ఇలా..మూడు రోజుల పాటు ఉదయం తెమడ పరీక్షలు చేయించుకోవాలి. ఇలా చేయించుకున్న అన్ని పరీక్షల్లో నెగిటివ్‌గా వస్తే, ఎక్స్‌రే తీయించుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో నివేదికలు వస్తాయి. వ్యాధిని నిర్మూలించవచ్చు వైద్యులు చెప్పిన సలహాలు పాటిస్తే క్షయ వ్యాధిని తప్పక అరికట్టవచ్చు. రోగి విషయంలో ప్రత్యేక్షంగా పర్యవేక్షణ అవసరం. తక్కువ సమయంలో చికిత్స ద్వారా జబ్బును పూర్తిగా నయం చేయడానికి వీలుగా ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ కుటుంబాలకు వైద్యం అందుబాటులో ఉండే అవకాశాలు చాలా అరుదుగా ఉంటుంది. వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ మందులు లభిస్తాయి. కొత్తగా ఈ వ్యాధి సోకిన వారికి 6 లేక 7 మాసాల్లో, వ్యాధి ముదిరిన వారికి 8 నుంచి 9 నెలల్లో నయం చేయడానికి వీలుగా ఉంటుంది. హైదరాబాద్‌లో 10వేల టీబీ కేసులు ఉండగా 7,014మంది చికిత్స పొందినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. అరికట్టే విధానాలు...పుట్టిన బిడ్డకు వెంటనే(బీజీజీ) సూది మందు వేయించాలి. క్షయ వ్యాధిగ్రస్తుడు దగ్గు వచ్చినప్పుడు నోటికి చేతిరుమాలును అడ్డంగా పెట్టుకోవాలి.రోగి ఎక్కడపడితే అక్కడి ఉమ్మివేయొద్దు. జబ్బు నయమయ్యే వరకూ వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి.రోగి ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వెంటనే వైద్యుడి సలహాలు పాటించాలి. ఎందుకంటే అధిక శాతం ఈ వ్యాధి పిల్లల్లో వేగంగా సోకుతుంది.

# అధిక బరువు తగ్గేందుకు సింపుల్ టిప్స్...



అధిక బరువును తగ్గించుకునేందుకు నేటి తరుణంలో ప్రతి ఒక్కరు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు అనేక రకాల పద్ధతులను కూడా అనుసరిస్తున్నారు. అయితే కింద ఇచ్చిన పలు టిప్స్‌ను కూడా పాటిస్తే శరీరంలో అధికంగా పేరుకుపోయిన కొవ్వును, తద్వారా బరువును తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ టిప్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. 1. రోజుకి కనీసం అరలీటర్లు ఐస్‌కోల్డ్ నీటిని తాగాలి. ఇలా చేస్తే శరీర మెటబాలిజం వృద్ధి చెందుతుంది. తద్వారా అధిక బరువు కూడా తగ్గుతుంది. 2. కొబ్బరినీళ్లను ఎక్కువగా తాగాలి. ఇవి కూడా మెటబాలిజం ప్రక్రియను మెరుగుపరుస్తాయి. అధిక బరువును తగ్గించుకునేందుకు పనిచేస్తాయి. 3. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలు కరగాలంటే స్కిమ్డ్ మిల్క్ తాగాలి. స్కిమ్డ్ మిల్క్ అంటే కొవ్వు తీసిన పాలు. ఇవి కొవ్వును కరిగించేందుకు ఉపయోగపడతాయి. 4. కూరగాయల జ్యూస్‌ను నిత్యం తాగాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి తగినన్ని పోషకాలు లభించడంతోపాటు అధిక బరువు కూడా తగ్గుతుంది. 5. గ్రీన్ లేదా బ్లాక్ టీ తాగాలి. ఇతర టీల కంటే శరీరంలో పేరుకుపోయిన కొవ్వును కరిగించే శక్తి దాదాపు 43 శాతం వరకు ఈ టీలకే ఎక్కువగా ఉంది. 6. పుచ్చకాయ జ్యూస్‌ను తరచూ సేవించినా అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఇందులోని అమైనో ఆమ్లాలు శరీర కొవ్వును ఇట్టే కరిగించివేస్తాయి.

# 'వృద్ధాప్య ఛాయలు' కనిపించకుండా ఉండాలంటే..?



ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడంలోనే కాదు, నేటి తరుణంలో ప్రతి ఒక్కరు తమ అందం పట్ల కూడా శ్రద్ధ వహిస్తున్నారు. పురుషులు, స్త్రీలు అనే తేడా లేకుండా ఇప్పుడందరూ తమ సౌందర్యాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో అందంగా కనిపించడం కోసం వివిధ రకాల పద్ధతులను కూడా అవలంబిస్తున్నా రు. అయితే మనకు అందుబాటులో ఉన్న పలు ఆహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకుంటే వృద్ధాప్య ఛాయలు మీద పడకుండా, ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించేలా చేసుకోవచ్చు. అలాంటి ఆహారం గురించి ఇప్పుడు తెలుసుకుందా ం.వైన్‌ను మితంగా తీసుకుంటే అది గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి సమస్యలు రాకుండా చూస్తుంది. దీంతోపాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. అంతేకాకుండా వృద్ధాప్యం కారణంగా చర్మంపై వచ్చే ముడతలు కూడా తగ్గిపోతాయి. పుచ్చకాయలు... శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు పుచ్చకాయల్లో పుష్కలంగా ఉన్నాయి. ఇవి యవ్వనంగా కనిపించేందుకు కూడా దోహదం చేస్తాయి. అదేవిధంగా ఈ కాయల్లోని విటమిన్ ఎ, బి, సి, ఇ, జింక్‌లు శరీరానికి కావల్సిన పోషకాలను అందిస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. పుచ్చకాయలను నిత్యం తీసుకుంటే శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంటుంది. బ్లూబెర్రీలు... యాంటీ ఏజింగ్ గుణాలు బ్లూబెర్రీల్లో పుష్కలంగా ఉన్నాయి. వయస్సు మళ్లడం వల్ల వచ్చే ముడతలను తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిలో అధికంగానే ఉన్నాయి. నొప్పులు, వాపులను తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు బ్లూబెర్రీల్లో ఉన్నాయి. అవకాడోలు...అవకాడోలలో విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటుంది. ఇది చర్మాన్ని సంరక్షించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరంలోని పీహెచ్ విలువలను ఎల్లప్పుడూ సమతుల్యంగా ఉండేలా చూస్తుంది. యవ్వనంగా కనిపించేందుకు ఉపయోగపడుతుంది. నిమ్మకాయలు... వృద్ధాప్య ఛాయలు, ముడతలకు కారణమయ్యే ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నిమ్మకాయల్లో పుష్కలంగా ఉన్నాయి. వీటిలోని సి విటమిన్ చర్మాన్ని సంరక్షించడంలో ఉపయోగపడుతుంది. అంతేకాదు ముడతలను కూడా తగ్గిస్తుంది. ఆలివ్ ఆయిల్... చర్మానికి ప్రకాశాన్ని, మెరుపును అందించడంలో ఆలివ్ ఆయిల్ ఎంతగానో దోహదపడుతుంది. యాంటీ ఏజింగ్ గుణాల దీంట్లో ఉన్నాయి. వృద్ధాప్య ఛాయలను దరిచేరనీయని యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఆలివ్ ఆయిల్‌లో ఉన్నాయి. గ్రీన్ టీ...చర్మంపై ఏర్పడే ముడతలను తగ్గించడంతోపాటు ఎండ కారణంగా నాశనమైన చర్మ కణాలకు పునరుజ్జీవం కలిగించే గుణాలు గ్రీన్ టీలో ఉన్నాయి. అంతేకాకుండా గ్రీన్ టీలోని ఔషధ కారకాలు వృద్ధాప్య ఛాయలను కనిపించకుండా చేస్తాయి. ఆకుపచ్చని కూరగాయలు... ఆకుపచ్చని కూరగాయల్లో చర్మాన్ని సంరక్షించే బీటా కెరోటిన్, విటమిన్ సి, విటమిన్ కె తదితర పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గించే యాంటీ ఆక్సిడెంట్లు కూడా వీటిలో ఉన్నాయి. ఇవన్నీ చర్మానికి మెరుపును, ప్రకాశాన్ని కూడా ఇస్తాయి.

# పొట్టపై మడతా? ఉందిగా మసాజ్



కడుపు భాగంలో మడతలు మీ సౌందర్యాన్ని నాశనం చేస్తున్నాయి, పలు క్రీములు వాడి విసిగిపోయారా, ఆందోళన చెందకుండి. ప్రకృతి ప్రసాదించిన సహజసిద్ధ వనరులను సద్వినియోగం చేసుకుని నవయువ్వన్నంగా నిలవండి. హార్మోన్లలో మార్పులు, శరీరం వాస్తవ బరువును కోల్పోయిన సందర్భాల్లో మడతలు ఏర్పడతాయి. అయితే వీటిని నియంత్రించి, మృదువైన చర్మాన్ని తిరిగి సొంతం చేసుకునేందుకు సమగ్ర ఆహార ప్రణాళికను పాటించాలి.ముఖ్యంగా విటమిన్ 'సీ', 'ఏ' పోషకాల గల ఆహారాన్ని ప్రణాళికాబద్ధంగా తీసుకోవాలి. ప్రకృతి ప్రసాదించిన ఔషధాలతో శరీరానికి 'మసాజ్' చేస్తే శరీరం పై మడతలు తొలగిపోతాయి. ఈ 'ఆయిల్స్' కోసం మీరు ప్రత్యేకంగా ఖర్చు పెట్టాల్సిన అవసరంలేదు. అన్ని మీ ఇంట్లో దొరికేవే... ఒంటికి ఆయిల్ మసాజ్‌ను పట్టించటం వల్ల చర్మ మృదత్వాన్ని సంతరించుకోవటంతో పాటు రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది. ఈ ప్రభావంతో మీరు ఎప్పుడు ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనబడుతుంటారు. మహిళలకు వయసుతో నిమిత్తం లేకుండా ఈ మడతలు వ్యాపిస్తుంటాయి. ముఖ్యంగా మహిళల్లో ప్రసవం అనంతరం ఈ సమస్యలు వేధిస్తుంటాయి. వీటిని సులువుగా నియంత్రించుకునేందుకు అందుకోండి పలు చిట్కాలు..రెండు టీ స్పూన్ల 'బాదం' నూనెలో 1 టీ స్పూన్ 'వీట్ జర్మ్' ఆయిల్‌ని కలిపి, ఈ మిశ్రమంలో 5 చుక్కలు 'గులాబీ' నూనెతో పాటు 'ఆరెంజ్' ఫ్లేవర్ నూనెను జోడించి మడతల భాగంలో 20 నిమిషాల పాటు సుతి మెత్తంగా మర్ధనా చేయించుకోండ10 చుక్కల 'రోజ్ మ్యారీ' (దవనము చెట్టు నూనె)ను, 2 టీ స్పూన్ల 'బాదాం నూనె'లో కలిపి మడతలకు పట్టించండి. నూనెను చర్మం పీల్చుకునేంతవరకు మసాజ్ చేస్తూనే ఉండండి.5 చుక్కల 'లావెండర్' ఆయిల్‌లో, తగినంత 'ఆలివ్' ఆయిల్‌ను కలిపి మసాజ్ చేసకుంటే ఫలితం లభిస్తుంది, అదేవిధంగా మూడు టీ స్పూన్ల 'జోజో బా' ఆయిల్‌లో. 5 చుక్కల 'లావెండర్' ఆయిల్‌ను కలిపి మడతల భాగంలో పావుగంట పాటు మసాజ్ చేస్తే మడతలు మటుమాయమవుతాయి.

# గుండె జబ్బులను నివారించే వ్యాయామాలు

మీకు గుండెజబ్బులు వస్తాయేమోనన్న భయం ఉందా? వాటిని రాకుండా చేయాలన్నది మీ సంకల్పమా? కనీసం వీలైనంత ఆలస్యం చేయాలన్నది మీ ఉద్దేశమా? అయితే ఈ కింద పేర్కొన్న వ్యాయామాల్లో ఏదో ఒకటి చేయండి. అవన్నీ గుండెజబ్బుల (కార్డియో వాస్క్యులార్ డిసీజెస్) ను ఎదుర్కోగల సామర్థ్యం ఉన్నవే. ఈతను మినహాయిస్తే వాటిలో చాలావరకు ఇంట్లోనే చేయవచ్చు. ఎవరి సహాయం లేకుండానే చేసుకోవచ్చు. అవి గుండెజబ్బులను నివారించడమే కాదు. కండరాలను ధృఢతరం చేస్తాయి. అదనపు క్యాలరీలను నశింపజేస్తాయి. వీటిని వారంలో కనీసం నాలుగు నుంచి ఐదు రోజుల వరకు రోజూ 75 నిమిషాల పాటు చేయండి. గుండెజబ్బుల నివారణ చాలావరకు ష్యూర్. ఆరోగ్యం గ్యారంటీ. ఈతఈత విశిష్టత ఏమిటంటే... అది విశ్రాంతినిస్తూ కూడా వ్యాయామాన్నిస్తుంది. రన్నింగ్‌లో అలిసేంతగా ఈతలోనూ అలసిపోవచ్చు. కానీ రన్నింగ్‌లో ఒంటిపై (ముఖ్యంగా కాళ్లపై) పడ్డ భారం ఈతలో పడదు. అయినప్పటికీ రన్నింగ్‌లో ఉన్నంత ప్రయోజనం ఈతతోనూ ఉంటుంది. కానీ మళ్లీ చురుగ్గా వ్యాయామం మొదలుపెట్టగానే గుండె నుంచి శరీరంలోని అన్ని అవయవాలకూ మిగతా వ్యాయామాలు చేస్తే ఎంత రక్తం వెళ్తుందో... ఈతలోనూ అంతే వెళ్తుంది. దీనికి కారణం ఒక్కటే. మన శరీరాన్ని నీళ్లలో ప్రవేశపెట్టగానే మనపై పనిచేసే భూమ్యాకర్షణశక్తి తగ్గుతుంది. అందుకే మామూలుగా ఉన్నప్పుడు గుండెకు విశ్రాంతి. మళ్లీ చురుగ్గా ఈదడం మొదలుపెట్టగానే కండరాలపై భారం పడకుండానే ఎంతో శక్తిని వెచ్చించాల్సి వస్తుంది. వేగంగా మెట్లెక్కడంఇది ఏ ఉపకరణాలూ లేకుండా ఇంట్లోనే చేయదగ్గ మరో వ్యాయామం. మన దగ్గర స్కిప్పింగ్ చేయడానికి తాడు వంటి ప్రాథమిక వనరులు లేవనుకోండి. ఇక చేయాల్సిందల్లా వేగంగా ఇంట్లోని మెట్లు ఎక్కుతూ, దిగుతూ ఉండటమే. దాంతోనూ చాలావరకు శరీరానికి వ్యాయామం సమకూరుతుంది. ట్రెడ్‌మిల్‌ట్రెడ్‌మిల్‌ను ఇంటి దగ్గర కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై నడవడం లేదా నెమ్మదిగా పరుగెత్తడం చేయవచ్చు. జిమ్‌కు వెళ్లి కొత్తగా వ్యాయామం చేయడానికి బిడియపడేవారు దీన్ని ఇంట్లోనే



సమకూర్చుకుంటే ఎప్పటికీ వ్యాయామం చేసుకోవచ్చు. స్కిప్పింగ్‌మీ స్కిప్పింగ్ రోప్ పొడవు సరిగా ఉందా లేదా చూడటానికి ఒక చిన్న సూచన. తాడును మీ అరికాలి కింద అదిమి పెట్టి ఉంచండి. తాడు చివరలను ఇరువైపులా రెండు చేతులతో పట్టుకోండి. తాడు పొడవు రెండు వైపులా సమానంగా ఉండేలా చూస్తూ... అది ఇరువైపులా మీ భుజాలకు కాస్త కింద, దాదాపు బాహుమూలాల వద్ద ఉందేమో చూడండి. లాగైతే ఆ తాడు మీరు ఆడేందుకు (స్కిప్పింగ్ చేసేందుకు) సరైన పొడవు ఉన్నట్లు అర్థం. తొలుత 30 సెకన్లు, ఆ తర్వాత ఒక నిమిషం... అలా రోజూ ఐదు సెట్స్ చేయడం కొనసాగిస్తూ పొండి. మిగతా అంశాలుగుండెజబ్బులను నిరోధించేందుకు వ్యాయామం అన్నది కేవలం ఒక అంశం మాత్రమే. దాంతోనే అంతా సంపూర్ణం కాదు. ఇక గుండెజబ్బులను అసలు రాకుండా ఉంచుకోవాలంటే అవసరమైన మిగతా అంశాలు : రక్తపోటును పూర్తిగా అదుపులో ఉంచుకోవాలి. ఎప్పుడూ పొగతాగకూడదు. ఆ అలవాటు ఉంటే తక్షణం మానేయాలి. డయాబెటిస్‌ను దరిచేరనివ్వకూడదు.

# ఎల్‌టీసీజీ ట్యాక్స్‌లో ఏది లాభం?..

## స్థిరాస్తి విక్రయాలపై పాత, కొత్త పన్ను విధానాలు ఏమిటి?

ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను గత నెల 23న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రకటించిన దగ్గర్నుంచి లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్ను మాట అందరి నోటా వినిపిస్తున్నది. 2001 ఏప్రిల్ 1 నుంచి కొన్న ఇండ్లను ఇకపై అమ్మితే.. ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలంటూ బడ్జెట్‌లో మంత్రి చేసిన ప్రకటనే ఇందుకు కారణం.



ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటే?

ఇండెక్సేషన్ బెనిఫిట్ (ద్రవ్యోల్బణం ప్రయోజనం)ను కాస్ట్ ఇన్‌ఫ్లేషన్ ఇండెక్స్ (సీఐఐ) నెంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 ఆర్థిక సంవత్సరం నుంచి (2001 ఏప్రిల్ 1 మొదలు) ప్రతీ ఆర్థిక సంవత్సరం కొత్త సీఐఐ సిరీస్ నెంబర్లను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02లో ఇల్లు కొనడానికి మీరు పెట్టిన ప్రతీ లక్ష రూపాయల విలువ.. ప్రస్తుతం రూ.3.63 లక్షలతో సమానం. ఒకవేళ నాడు రూ.5 లక్షలకు కొంటే.. ఇప్పుడు దాని విలువ రూ.18.15 లక్షలు. ఇంతకన్నా ఎక్కువ ధరకు మీ ఇల్లును అమ్ముకుంటే, ఆ మొత్తంపై మాత్రమే ఎల్‌టీసీజీ ట్యాక్స్ వర్తిస్తుంది. దీన్నే ఇండెక్సేషన్ బెనిఫిట్ అంటారు. దీన్ని తీసేస్తామని, దానికి బదులుగా పన్నును 20 శాతం నుంచి 12.5 శాతానికి (7.5 శాతం) తగ్గిస్తామని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వర్గాలు, ఇండస్ట్రీ నిపుణుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకతే వ్యక్తమైంది. దీనికి తలొగ్గిన మోదీ సర్కారు.. బడ్జెట్‌లో తాము తెచ్చిన కొత్త పన్ను విధానం, ఇప్పటికే ఉన్న పాత పన్ను విధానం రెండూ అమల్లో ఉంటాయని, ఏది లాభమైతే దాన్ని ట్యాక్స్ పేయర్స్ ఎంచుకోవచ్చని గత వారం పార్లమెంట్‌లో సభ్యులకు పంచిన ఆర్థిక బిల్లు-2024 సవరణ డాక్యుమెంట్లలో చెప్పిం ది. అసలు ఈ రెండు విధానాలు ఎలా ఉన్నాయి? ఇందులో ఏది లాభం? అనేది పక్కనున్న బాక్స్‌లో పరిశీలించవచ్చు.

చివరగా..

బడ్జెట్‌కు ముందు (ఈ ఏడాది జూలై 23) ఇల్లు కొని, వాటిని ఇప్పుడు అమ్ముతున్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాల (హెచ్‌యూఎఫ్)వారికే ఇండెక్సేషన్ బెనిఫిట్‌ను ఎంచుకునే వీలుంటుందని ఆర్థిక బిల్లు సవరణలో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీని ప్రకారం గత నెల 23 లేదా ఆ తర్వాత ఇండ్లు కొన్నవారు భవిష్యత్తులో వాటిని అమ్ముకుంటే ఇండెక్సేషన్ బెనిఫిట్ వర్తించదన్నమాట. అంటే అధిక ఎల్‌టీసీజీ ట్యాక్స్ భారాన్ని మోయక తప్పదు.

పాత పన్ను ప్రకారం

2014-15లో రూ.40 లక్షలతో మహేశ్ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 240గా ఉన్నది. ఈ ఏడాది జూన్‌లో దాన్ని రూ.75 లక్షలకు అమ్మేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/240= 1.5125 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.40 లక్షలతో గుణిస్తే.. రూ.60,50,000గా ఉంటుంది. ఇదిప్పుడు మహేశ్ ఇంటి విలువ అన్నమాట. ఇక ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.75,00,000 నుంచి ఈ రూ.60, 50,000ను తీసేయాలి. అప్పుడు రూ.14,50,000 మిగులుతుంది. దీనిపైనే ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.2.90 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.75 లక్షల నుంచి కొన్న ధర రూ.40 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.35 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.4,37,500 కట్టాలి. పాత పన్ను ప్రకారం చెల్లింపుతో చూస్తే ఈ కొత్త పన్ను ప్రకారం మీపై రూ.1,47,500 అదనపు భారం పడుతున్నదన్నమాట. ఎల్‌టీసీజీ పన్ను చెల్లింపుల్లో ఇండెక్సేషన్ బెనిఫిట్ ఉండటం వల్ల పాత పన్ను విధానంలో ట్యాక్స్ పేయర్లకు కలిగే లాభం, దాన్ని తీసేయటం వల్ల కొత్త పన్ను విధానంలో వచ్చే నష్టం ఇదే. కాబట్టి మహేశ్ పాత పన్ను విధానాన్ని ఎంచుకుని ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను చెల్లిస్తే రూ.1,47,500 మిగులుతుంది. అలా కాదని, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకుంటే ఆ మేరకు నష్టపోవాల్సి వస్తుంది.

2001 ఏప్రిల్ 1కి ముందు..

గత నెల ప్రకటించిన బడ్జెట్‌లో 2001 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత కొన్న ఇండ్ల అమ్మకాలపైనే ఎల్‌టీసీజీ ట్యాక్స్ లెక్కింపులో మార్పులు చేశారు. అయితే అంతకుముందు మాటేమిటి? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తకమానదు. 2001 మార్చి 31లోపు కొన్న ఇండ్ల విక్రయాలకు 1981-82 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరం మధ్య ఉన్న ఐటీ శాఖ పాత సీఐఐ నెంబర్ సిరీస్ ఆధారంగా ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను లెక్కిస్తారు. అయితే ఇప్పుడు అమ్ముకున్నా 2016-17 సీఐఐ నెంబరే వర్తిస్తుందని గుర్తుంచుకోవాలి. దీనికి ఇటీవలి బడ్జెట్ సవరణలతో పనిలేదు. కాబట్టి 2001 మార్చి 31లోపు ఇండ్లు కొన్నవారు పాత సీఐఐ నెంబర్ల ప్రకారమే తమ స్థిరాస్తి క్రయవిక్రయాలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లించవచ్చు.

ఇదీ లెక్క..

ఉదాహరణకు 1984 జూన్‌లో మీరు రూ.2 లక్షలు పెట్టి ఇల్లు కొన్నారు. అప్పుడు సీఐఐ నెంబర్ 125గా ఉన్నది. ఈ ఏడాది జూన్‌లో దాన్ని రూ.25 లక్షలకు అమ్మేశారు. దీనికి పాత సీఐఐ సిరీస్‌లో ఆఖరుదైన 2016-17 ఆర్థిక సంవత్సరం సీఐఐ నెంబర్ 1,125 వర్తిస్తుంది. అంటే ఇల్లు అమ్మిన సంవత్సరం సీఐఐ 1,125 నుంచి ఇల్లు కొన్న సీఐఐ 125ను భాగించాలి. అప్పుడు 9 వస్తుంది. దీన్ని ఇల్లు కొన్న ధర రూ.2 లక్షలతో గుణించాలి. రూ.18 లక్షలు వస్తుంది. ఇదే ఇప్పుడు మీ ఇల్లు విలువ. మీరు అమ్మిన రూ.25 లక్షల నుంచి ఈ రూ.18 లక్షలను తీసేస్తే మిగిలే ఆ రూ.7 లక్షలపైనే 20 శాతం ఎల్‌టీసీజీ ట్యాక్స్ చెల్లించాలి. దీని ప్రకారం రూ.1.4 లక్షలు చెల్లిస్తే చాలు.

1981 ఏప్రిల్ 1కి ముందైతే..

1981 మార్చి 31 లేదా అంతకు ముందు కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్ముకుంటే దానికి ఎల్‌టీసీజీ పన్నును కట్టేందుకు 1981-82 నుంచి 2016-17 మధ్య ఉన్న సీఐఐ నెంబర్లే వర్తిస్తాయి. అప్పుడు ఇల్లు కొన్నప్పటి సీఐఐ నెంబర్‌గా 1981-82కు చెందిన ప్రారంభ నెంబర్ 100ను పరిగణిస్తారు. 2017 మార్చి 31లోపు అమ్మితే ఆయా ఆర్థిక సంవత్సరాల సీఐఐలను చూస్తారు. ఆ తర్వాత విక్రయిస్తే పాత సిరీస్ చివరి సీఐఐ నెంబర్ 1,125 వర్తిస్తుంది. ఒకవేళ పాత సీఐఐ సిరీస్ వద్దనుకుంటే కొత్త సీఐఐ సిరీస్‌నూ ఎంచుకోవచ్చు. కానీ మీ ఇంటి విలువను ఓ రిజిస్టర్డ్ అప్రైజర్‌తో లెక్క కట్టించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫెయిర్ మార్కెట్ వాల్యూ (ఎఫ్‌ఎంవీ)ను సదరు అప్రైజర్ లెక్కిస్తారు. అప్పుడు మీ ఇల్లు కొన్న సీఐఐ నెంబర్ 2001-02కు చెందిన 100గా పరిగణిస్తారు. ఒకవేళ 2010-11లో అమ్ముకుంటే అప్పటి సీఐఐ 167, ఇప్పుడు అమ్ముకోవాలనుకుంటే 2024-25 సీఐఐ 363 ఆధారంగా ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను లెక్కిస్తారు. ఉదాహరణకు 1950లో కొన్న మీ ఇంటి ఫెయిర్ మార్కెట్ వాల్యూను రిజిస్టర్డ్ అప్రైజర్ రూ.15 లక్షలుగా తేల్చారు. ఇప్పుడు దాన్ని రూ.70 లక్షలకు అమ్ముకున్నారు. దీంతో ఇంటిని అమ్మిన సీఐఐ 363తో ఇంటిని కొన్న సీఐఐ 100ను భాగించాలి. అప్పుడు 3.63 వస్తుంది. దీన్ని ఇంటి ఎఫ్‌ఎంవీ రూ.15 లక్షలతో గుణించాలి. అప్పుడు రూ.54.45 లక్షలుగా ఉంటుంది. ఇండెక్సేషన్ బెనిఫిట్ ప్రకారం ఇదే మీ ఇంటి ప్రస్తుత విలువ. అమ్మిన రూ.70 లక్షల నుంచి దీన్ని తీసేయాలి.

# ఆన్‌లైన్‌లోనూ ఎల్ఐసీ సేవలు షురూ.. పాలసీ స్టేటస్ తెలుసుకోవడం చాలా ఈజీ




లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా భారతదేశంలోని ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటిగా ప్రజాదరణ పొందింది. దేశవ్యాప్తంగా సేవలను అందించే మొదటి బీమా సంస్థగా ఎల్ఐసీ నిలిచింది. జీవిత బీమా అంటే ఎల్ఐసీ అనే విధంగా ప్రజలు ఆదరించారు. ఈ నేపథ్యంలో మారుతున్న కాలంతో పాటు టెక్నాలజీ నేపథ్యంలో వినియోగదారులకు చేరువ కావడానికి ఎల్ఐసీ అనేక కీలక చర్యలను చేపట్టింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా భారతదేశంలోని ప్రముఖ బీమా సంస్థల్లో ఒకటిగా ప్రజాదరణ పొందింది. దేశవ్యాప్తంగా సేవలను అందించే మొదటి బీమా సంస్థగా ఎల్ఐసీ నిలిచింది. జీవిత బీమా అంటే ఎల్ఐసీ అనే విధంగా ప్రజలు ఆదరించారు. ఈ నేపథ్యంలో మారుతున్న కాలంతో పాటు టెక్నాలజీ నేపథ్యంలో వినియోగదారులకు చేరువ కావడానికి ఎల్ఐసీ అనేక కీలక చర్యలను చేపట్టింది. చాలా మంది వినియోగదారులు పాలసీ తీసుకున్న తర్వాత కేవలం బీమా ప్రీమియం చెల్లించే సమయంలో పాలసీకు సంబంధించిన ఇబ్బందులను ఎదుర్కొంటారు. ముఖ్యంగా ఇటీవలే ఎల్ఐసీ పాలసీలను ఆన్‌లైన్ చెల్లింపులను ప్రారంభించిన కంపెనీ ఆన్‌లైన్ ద్వారానే చాలా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ ఆన్‌లైన్ సేవలకు రిజిస్టర్ చేసుకున్న తర్వాత పాలసీ స్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకునే వీలు ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ ఆన్‌లైన్ సేవల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

ఆన్‌లైన్ సేవలకు యాక్సెస్ ఇలా

ఎల్ఐసీ అధికారిక వెబ్‌పేజీని సందర్శించి, "ఆన్‌లైన్ సర్వీస్" క్లిక్ చేయాలి.

అనంతరం ఈ-సేవ పేజీ కింద ఉన్న కస్టమర్ పోర్టల్‌ను ఎంచుకోవాలి.

సైన్-అప్ ప్రక్రియ కోసం "న్యూ యూజర్‌ను ఎంచుకోవాలి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారమ్ వివరాలను పూరించండి.

యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌ను సెట్ చేసుకోవాలి.

రిజిస్ట్రేషన్ విజయవంతంగా పూర్తయిన తర్వాత వినియోగదారు రిజిస్టర్డ్ మెయిల్ ఐడిలో ధ్రువీకరణ ఈ-మెయిల్‌ను అందుకుంటారు.

అనంతరం యూజర్ ఎల్ఐసీ ఆన్‌లైన్ సేవలను పొందవచ్చు.

ఆన్‌లైన్‌లో పాలసీ స్టేటస్ తెలుసుకోవడం ఇలా

ఎల్ఐసీ అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లి ఆన్‌లైన్ సేవల కింద ఉన్న "కస్టమర్ పోర్టల్"పై క్లిక్ చేయాలి.

లాగ్-ఇన్ పేజీలో "రిజిస్టర్డ్ యూజర్" ట్యాబ్‌ను ఎంచుకోవాలి.

యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ద్వారా ఖాతాలోకి లాగిన్ అవ్వాలి.

లాగిన్ తర్వాత ఎన్‌రోల్డ్ పాలసీలను ఎంచుకోవాలి.

అనంతరం డ్రాప్‌డౌన్ మెనులో మీ అన్ని ఎల్ఐసీ పాలసీలు వస్తాయి.

అక్కడ మీ పాలసీ నెంబర్‌ను ఎంచుకుని పాలసీకి సంబంధించిన అన్ని వివరాలను తనిఖీ చేయాలి.

ఎల్ఐసీ పాలసీ నమోదు ఇలా

ఎల్ఐసీ వినియోగదారుడు పాలసీ తీసుకున్న తర్వాత ఆన్‌లైన్ పోర్టల్‌లో పాలసీను నమోదు చేయాలంటే ప్రత్యేక ప్రక్రియ ఉంది.

ముందుగా ఎల్ఐసీ అధికారిక పోర్టల్‌ను ఎంచుకుని, ఎల్ఐసీ పాలసీ నమోదు ఫారమ్‌ను ఎంచుకోవాలి.

పాలసీదారు ఎన్‌రోల్‌మెంట్ ఫారమ్‌ను పూరించవచ్చు. చెల్లుబాటు అయ్యే పాలసీ నంబర్‌ను అందించవచ్చు.

# ఆ ఆరోపణలు నిరాధారం.. మా వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు హిండెన్ బర్గ్ యత్నం





భారత్ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ', సెబీ చైర్ పర్సన్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకే అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న షార్ట్ సెల్లర్ 'హిండెన్ బర్గ్ రీసెర్చ్' ఆరోపణలు చేసిందని సెబీ చైర్ పర్సన్ మాధాబీ పురీ బుచ్, ఆమె భర్త ధావల్ బుచి పేర్కొన్నారు. హిండెన్ బర్గ్ రీసెర్చ్ శనివారం తమపై చేసిన ఆరోపణలకు ఆదివారం మాధాబీ పురీ బుచ్ దంపతులు వివరణాత్మక ప్రకటన చేశారు. 'సెబీ విశ్వసనీయతను, సెబీ చైర్ పర్సన్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేందుకు వారు ఆరోపణలు చేశారు' అని ఆ ప్రకటన పేర్కొంది. అదానీ గ్రూప్ అనుబంధ ఆఫ్ షోర్ కంపెనీల్లో మాధాబి పురీ బుచి పెట్టుబడులు ఉన్నందు వల్లే ఆ సంస్థకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు సెబీ చైర్ పర్సన్ అయిష్టత చూపుతున్నారని హిండెన్ బర్గ్ శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన బుచ్ దంపతులు.. హిండెన్ బర్గ్ ఆరోపణలు నిరాధారం అని పేర్కొన్నారు. మాధాబీ పురీ బుచ్.. సెబీ చైర్ పర్సన్ గా పని చేస్తుండగా, బ్లాక్ స్టోన్ సీనియర్ సలహాదారుగా ధావల్ బుచ్ పని చేస్తున్నారు. 2017లో సెబీ పూర్తికాల సభ్యురాలిగా చేరడానికి రెండేండ్ల ముందే ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్మెంట్ ప్రమోట్ చేసిన సింగపూర్ సంస్థలో తమ పెట్టుబడులు పెట్టామని బుచ్ దంపతులు తెలిపారు. తమ బాల్య స్నేహితుడు అనిల్ అహుజా సలహా మేరకే రెండు ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నట్లు బుచ్ దంపతులు తమ ప్రకటనలో వెల్లడించారు. అప్పుడు మారిషస్ కేంద్రంగా పని చేస్తున్న ఐపీఈ ప్లస్ ఫండ్ వ్యవస్థాపకుడు- చీఫ్ ఇన్వెస్ట్ మెంట్ ఆఫీసర్ గా అనిల్ అహుజా ఉన్నారని హిండెన్ బర్గ్ పేర్కొంది. అదానీ పవర్ (2007-08)లో 3ఐ ఇన్వెస్ట్ ఫండ్ నామినీగా కూడా అనిల్ అహుజా ఉన్నారని హిండెన్ బర్గ్ గుర్తు చేసింది. 2017 జూన్ నాటికి తొమ్మిదేండ్ల పాటు అదానీ ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ గానూ అనిల్ అహుజా పని చేశారని హిండెన్ బర్గ్ తెలిపింది. అదానీ గ్రూప్ సంస్థలపై గతంలో చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని తాము జారీ చేసిన నోటీసుకు స్పందించకుండా సెబీ విశ్వసనీయతపైనా దాడి చేయడంతోపాటు తమ వ్యక్తిత్వాన్ని హిండెన్ బర్గ్ దెబ్బ తీస్తున్నదని బుచ్ దంపతులు పేర్కొన్నారు.

# యూఎస్ లో మాంద్యం భయాలు




గత రెండు నెలలుగా దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు ఆగస్టులో నిధులు ఉపసంహరించుకున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్లు రూ.13,400 కోట్ల పైచిలుకు వాటాలను విక్రయించారు. జపాన్ కరెన్సీ 'యెన్' క్యారీ ట్రేడ్ తోపాటు ఈ ఏడాది అమెరికాలో మాంద్యం ముప్పు పొంచి ఉందన్న భయాల మధ్య విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. దేశీయ స్టాక్ మార్కెట్లలో వాటాలు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఎఫ్‌పీఐలు రూ.22,134 కోట్ల విలువైన వాటాలు కొనుగోలు చేశారు. ఒకవేళ దేశీయ స్టాక్ మార్కెట్లలో వృద్ధి కొనసాగినట్లయితే ఎఫ్‌పీఐలు మరింతగా తమ వాటాలను విక్రయించే అవకాశం ఉందని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్‌వెస్ట్‌మెంట్ స్ట్రాటర్జిస్ట్ వీకే విజయకుమార్ తెలిపారు. విదేశీ మార్కెట్లలో పరిస్థితిని బట్టి ఎఫ్ పీఐల కదలికలు ఉంటాయన్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ ఎఫ్‌పీఐలు రూ.13,431 కోట్ల విలువైన షేర్లు ఉపసంహరించుకున్నారు. దేశీయంగా సంస్కరణలు కొనసాగుతాయన్న అంచనాలు, ఊహించినదానికన్నా మెరుగ్గా కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు ఉండటంతోపాటు సుస్థిరంగా భారత్ వృద్ధిరేటు సాగుతుందన్న అంచనాల మధ్య జూలైలో రూ.32,365 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. అంతకుముందు జాతీయ స్థాయిలో రాజకీయ సుస్థిరత నెలకొనడంతో మార్కెట్లు పుంజుకోవడంతో జూన్ నెలలో ఎఫ్ పీఐలు రూ.26,565 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ లో రూ.8,700 కోట్లు, మేలో రూ.25,586 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ పీఐలు ఉపసంహరించుకున్నారు.

# టాప్-10లో ఎనిమిది సంస్థల ఎం-క్యాప్ రూ.1.66 లక్షల కోట్లు లాస్.




గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ-30లో టాప్-10 సంస్థల్లో ఎనిమిది సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,66,954.07 కోట్లు హరించుకుపోయింది. వాటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) భారీగా నష్టపోయాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ గతవారం 1,276.04 పాయింట్లు (1.57 శాతం) పతనమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.33,930.56 కోట్లు నష్టపోయి రూ.19,94,765.01 కోట్లకు చేరుకున్నది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎం-క్యాప్ రూ.30,674.24 కోట్ల పతనంతో రూ.7,17,001.74 కోట్ల వద్ద స్థిర పడింది. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ.21,151.33 కోట్ల నష్టంతో రూ.7,35,566.52 కోట్ల వద్ద ముగిసింది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.20,973.19 కోట్ల నష్టంతో రూ.7,35,277.28 కోట్లకు చేరుకున్నది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.19,157.77 కోట్లు పతనమై రూ.15,30,469.11 కోట్లకు పరిమితమైంది. భారతీ ఎయిర్ టెల్ ఎం-క్యాప్ రూ.16,993.56 కోట్ల నష్టంతో రూ.8,33,396.32 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.16,975.55 కోట్లు కోల్పోయి రూ.8,25,201.23 కోట్ల వద్ద ముగిసింది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7,095.87 కోట్లు పతనమై రూ.12,56,505.53 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) ఎం-క్యాప్ రూ.12,946.24 కోట్ల వృద్ధితో రూ.6,45,808.65 కోట్ల వద్ద నిలిచింది. ఐటీసీ ఎం-క్యాప్ రూ.8,406.26 కోట్ల లబ్ధితో రూ.6,19,829.37 కోట్లకు పెరిగింది. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్ -10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీయ స్టేట్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), ఐటీసీ నిలిచాయి.




# బాక్సాఫీస్ క్లాష్ లో గ్లామర్ ఫైట్ ఈ నెలలో రెండు మాస్ కమర్షియల్ యాక్షన్ మూవీస్



ఈ నెలలో రెండు మాస్ కమర్షియల్ యాక్షన్ మూవీస్ ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాయి. ఆగష్టు 15న మాస్ మహారాజ్ రవితేజ మిస్టర్ బచ్చన్ తో సత్తా చూపించడానికి రెడీ అయ్యాడు. మరో వైపు ఇస్మార్ట్ శంకర్ తో సక్సెస్ కొట్టిన రామ్ పోతినేని డబుల్ ఇస్మార్ట్ తో డబుల్ సక్సెస్ అందుకోవాలని అనుకుంటున్నారు. ఈ రెండు సినిమాలపైన కూడా యూత్ లో మంచి క్రేజ్ ఉంది. అలాగే ఈ రెండు చిత్రాలని తెరకెక్కించింది కమర్షియల్ డైరెక్టర్స్ గా మంచి పేరున్న పూరి జగన్నాథ్, హరీష్ శంకర్ కావడం విశేషం. ఇందులో మరో విశేషమేంటంటే హీరో క్యారెక్టరైజేషన్స్ పరంగా హరీష్ శంకర్ పైన పూరి జగన్నాథ్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇద్దరు ఆర్జీవీ దగ్గర వర్క్ చేసినవారే. ఇందులో మరో ప్రత్యేకత కూడా ఉంది. పూరి జగన్నాథ్ సినిమాలతోనే మాస్ మహారాజ్ రవితేజ స్టార్ హీరోగా టాలీవుడ్ లో ఎస్టాబ్లిష్ అయ్యాడు. అందుకే ఇప్పుడు మిస్టర్ బచ్చన్, డబుల్ ఇస్మార్ట్ సినిమాల మధ్య ఫైట్ ని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ రెండింటిలో విన్నర్ ఎవరవుతారా అనే క్యూరియాసిటీ ప్రతి ఒక్కరిలో ఉంది. సూర్య అతి భయాంకర 'కంగువ' రెండు సినిమాలపైన భారీగానే బిజినెస్ జరిగింది. అలాగే ఎక్స్ పెక్టేషన్స్ కూడా హెవీగానే ఉన్నాయి. ఇదిలా ఉంటే ఈ సినిమాలకి సంబందించి మరో ఇంటరెస్టింగ్ ఫైట్ ని కూడా ప్రేక్షకులు చూడబోతున్నారు. అది డబుల్ ఇస్మార్ట్ హీరోయిన్ కావ్య థాపర్, మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే మధ్య. భాగ్యశ్రీ బోర్సే మిస్టర్ బచ్చన్ తో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. మొదటి చిత్రంతోనే గ్లామర్ తో పాటు డాన్స్ పరంగా భాగ్యశ్రీ కుర్రకారు హృదయాలని గెలుచుకుంది. హరీష్ శంకర్ భాగ్యశ్రీ అందాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ సినిమా రిలీజ్ కాకుండానే మరో రెండు ఛాన్స్ లు భాగ్యశ్రీ అందుకుంది. మిస్టర్ బచ్చన్ లో ఆమె పెర్ఫార్మెన్స్ కూడా ఆకట్టుకుంటే నెక్స్ట్ టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా మారిపోతుందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇక కావ్యా థాపర్ ఈ మాయ పేరేమిటో సినిమాతో 2018లోనే టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తరువాత సంతోష్ శోభన్ కి జోడీగా ఏక్ మినీ కథ మూవీతో సక్సెస్ అందుకుంది. రొమాంటిక్ డోస్ రవితేజ ఈగల్, సందీప్ కిషన్ ఊరుపేరు భైరవకోన సినిమాలలో కావ్య థాపర్ నటించింది. ఈ సినిమాలలో ఆమె నటిగా పర్వాలేదనే స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సక్సెస్ లు అందుకోలేదు. ఇప్పటి వరకు ఎవరు కూడా కావ్య థాపర్ ని గ్లామరస్ గా చూపించే ప్రయత్నం చేయలేదు. పూరి జగన్నాథ్ మాత్రం డబుల్ ఇస్మార్ట్ లో కావ్య థాపర్ ను తెరపై చాలా అందంగా ఆవిష్కరించారు. ఇప్పటికే డబుల్ ఇస్మార్ట్ సాంగ్స్ అండ్ ట్రైలర్ లో హాట్ అండ్ బోల్డ్ షో తో కావ్య థాపర్ అందరిని మెస్మరైజ్ చేసింది. ఈ మూవీ సక్సెస్ అయితే నెక్స్ట్ టాలీవుడ్ గ్లామర్ క్వీన్ గా కావ్య థాపర్ మారే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. మరి ఈ ఇద్దరు భామలతో ఎవరు ప్రేక్షకులని ఎట్రాక్ట్ చేసి ఆగష్టు 15 విన్నర్ గా నిలుస్తారనేది వేచి చూడాలి.

# పూరి హీరోలు 'తుపాకి'లో బుల్లెట్స్ వంటివారు



ఉస్తాద్ రామ్ పోతినేని – డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం డబుల్ ఇస్మార్ట్ ప్రచార సామగ్రికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను మేకర్స్ వరంగల్‌లో ఘనంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రామ్ పోతినేని మాట్లాడుతూ కమర్షియల్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ క్వాలిటీస్ గురించి హైలైట్ చేసారు. పూరి తుపాకి లాంటోడు అయితే అతడి హీరోలు బుల్లెట్ల వంటి వారు! అని రామ్ ఈ వేదికపై వ్యాఖ్యానించారు. పూరి తో పని చేయడం ఎంత ఆనందాన్నిస్తుందో మీకు చెప్పాలి. నేను సెట్‌కి వెళ్లగానే నా ప్రపంచం పూర్తిగా మారిపోతుంది. నేను శక్తిని పొందుతాను.. పనిని ఆస్వాధించడం ప్రారంభిస్తాను. అతన్ని లెజెండ్ అని పిలవడం నాకు ఇష్టం లేదు. ఇప్పటికీ తెలుగు చిత్రసీమలో స్ఫూర్తిదాయకమైన దర్శకుల్లో ఆయన ఒకరు. అడవిలో పుష్ప రాజ్ రొమాంటిక్ డోస్ ఇండస్ట్రీలో చాలా మంది రచయితగా, దర్శకుడిగా మారాలంటే పూరీ గారి వైపు చూస్తారు. నేను అతని పేరును నా ఫోన్‌లో 'తుపాకి' అని సేవ్ చేసాను. పూరి తుపాకి లాంటి వాడు.. అతడి హీరోలు బుల్లెట్స్ లాంటివారు. ఆగస్ట్ 15న పూరి జగన్నాధ్ లాంటి 'తుపాకీ' నుంచి ఎంత బలాన్ని తీసుకువస్తానో మీరు చూస్తారు. పూరీతో కలిసి పనిచేయడం వల్ల నేను పొందిన థ్రిల్ ఎంతో గొప్పది" అని రామ్ అన్నారు. సంగీతం గురించి మాట్లాడుతూ ..మా అందరికంటే మణిశర్మ చాలా టెన్షన్ పడ్డాడు. ఇస్మార్ట్ శంకర్ ఆడియో భారీ విజయాన్ని అందుకోవడంతో, డబుల్ ఇస్మార్ట్ కోసం ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. సాధారణంగా సీక్వెల్స్‌పై అంచనాలు ఉంటాయి. అయితే ఈ సినిమా ఆడియోపై కూడా అంచనాలు పెరిగిపోయాయి. పాటలకు అద్భుతమైన స్పందన రావడంతో అంచనాలు అందుకుంటున్నాయి. ప్రేక్షకులు వాటిని తెరపై చూసినప్పుడు పాటలు తదుపరి స్థాయికి చేరుకుంటాయని నేను నమ్ముతున్నాను.. అని అన్నారు. సంజు బాబా, మీతో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఈ పాత్రలో మిమ్మల్ని తప్ప మరెవరినీ ఊహించుకోలేకపోయాం. కావ్య అద్భుతమైన అమ్మాయి. ఆమె చాలా అంకితభావం మరియు నిబద్ధతతో ఉంది. ఆమె డైలాగ్స్ నేర్చుకుని తెలుగులో చెప్పింది. అలీ గారితో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఛార్మీ ఒక ఫైటర్.. అని రామ్ అన్నారు. పూరి జగన్నాధ్ మాట్లాడుతూ "డబుల్ ఇస్మార్ట్ అనగానే నాకు గుర్తుకు వచ్చే పేరు పోతినేని రామ్. రామ్ తెచ్చిన శక్తి అసమానమైనది. సెట్స్‌పైకి వెళ్లినప్పుడు రామ్‌లోని ఎనర్జీ మనకు కనిపిస్తుంది. ఇది నన్ను ఉత్తేజపరచడమే కాదు, నాకు శక్తినిస్తుంది. హెయిర్ స్టైల్, బాడీ లాంగ్వేజ్, తెలంగాణ స్లాంగ్, మరీ ముఖ్యంగా యాటిట్యూడ్‌తో ఆ పాత్రకు ఆ స్పెషాలిటీ తీసుకొచ్చాడు. ఈ ఎలిమెంట్స్ అన్నీ ఆయన చేత బాగా చేయలేకపోతే మనం ఆ పాత్రను అంతగా ఆస్వాదించలేము. రామ్ వల్లనే ఈ సినిమా సాధ్యమైంది. అతను అద్భుతమైన నృత్యకారుడు.. గొప్ప నటుడు... రామ్ లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు" అని పూరి అన్నారు. సంజయ్ దత్ 150 చిత్రాలకు పైగా నటించిన హీరో. నేను ఆయనకు పెద్ద అభిమానిని. ఈ సినిమాలో ఆయన కనిపించడం సినిమాకు కొత్త ఎనర్జీని తీసుకొచ్చింది. అలాగే కావ్య కూడా బాగా నటించింది. రామ్ పక్కన డ్యాన్స్ చేయడం చిన్న విషయం కాదు. ఆమె తెలుగులో తన డైలాగులన్నీ నేర్చుకుని, వాటిని దోషరహితంగా డెలివరీ చేసింది.. అని పూరి తెలిపారు.

# రామ్, పూరి జగన్నాధ్ గారితో వర్క్ చేయడం ప్లెజర్ అండ్ హానర్

# 'డబుల్ ఇస్మార్ట్' ఆడియన్స్ ని చాలా ఎంటర్ టైన్ చేస్తుంది



డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, ఉస్తాద్ రామ్ పోతినేని హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్' థియేట్రికల్ రిలీజ్ కౌంట్ డౌన్ ప్రారంభమైంది. సెన్సేషనల్ ప్రమోషనల్ కంటెంట్ తో నేషనల్ వైడ్ గా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తున్న ఈ మూవీ ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఈ మూవీ పవర్ ఫుల్ రోల్ పోషిస్తున్నారు. కావ్య థాపర్ హీరోయిన్. బిగ్ బుల్ అనే స్పెషల్ సాంగ్ లాంచ్ చేశారు మేకర్స్. పూరి జగన్నాథ్ తన విలన్‌లను పవర్‌ఫుల్ క్యారెక్టర్స్ ని ప్రెజెంట్ చేయడంలోస్పెషలిస్ట్. ఇప్పుడు ఆయన డబుల్ ఇస్మార్ట్‌లో మెయిన్ విలన్‌పై ఒక పాటను ఇంక్లూడ్ చేశారు. బిగ్ బుల్ క్యారెక్టర్ ని సంజయ్ దత్ పోషించారు. మణి శర్మ కంపోజ్ చేసిన "బిగ్ బుల్" విజువల్, మ్యూజికల్ గా పవర్ ఫుల్ నెంబర్. హై ఎనర్జీ, పండుగ వాతావరణంలో సెట్ చేయబడిన ఈ పాట, కావ్య థాపర్ గ్లామర్ టచ్ యాడ్ చేసింది, సినిమాలోని కీలక పాత్రలను ఒకచోట చేర్చింది. వారి పెర్ఫార్మెన్స్ డ్యాన్స్ ఫ్లోర్‌ను ఆదరగొడుతోంది. భాస్కరభట్ల రవి కుమార్ సాహిత్యం బిగ్ బుల్ పాత్ర ఎసెన్స్ ని ప్రజెంట్ చేస్తోంది. పృధ్వీ చం,సంజన కల్మంజే వోకల్స్ ట్రాక్‌కి మరింత ఎనర్జీని ఇచ్చాయి. డబుల్ ఇస్మార్ట్‌ను పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ మరియు ఛార్మి కౌర్ నిర్మించారు. సామ్ కె నాయుడు, జియాని జియానెలీ సినిమాటోగ్రఫీ అందించారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ముంబైలో గ్రాండ్ గా జరిగిన బిగ్ బుల్ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్తే. తెలుగు సినిమా డైనమిక్స్ ని మార్చిన డైరెక్టర్ పూరి జగన్నాథ్. ఈ సినిమాలో నన్ను పార్ట్ చేసి, బిగ్ బుల్ గా ప్రజెంట్ చేస్తున్న పూరి సర్ కి థాంక్ యూ. ఛార్మి పరేషాన్ చేసింది(నవ్వుతూ) తన హార్డ్ వర్క్, డెడికేషన్, ఫోకస్ వలనే ప్రోడక్ట్ అంత అద్భుతంగా వచ్చింది. కావ్య ఇందులో చాలా బ్యూటీఫుల్ గా కనిపించింది. విషు కి థాంక్ యూ. రామ్ నా యంగర్ బ్రదర్ లాంటి వాడు. తనకు పని చేయడం చాలా మజా వచ్చింది. డబుల్ ఇస్మార్ట్ గా మస్త్ ఉంటాడు. తనతో వర్క్ చేయడం ప్లెజర్ అండ్ హానర్. తను గుడ్ పెర్ఫార్మర్. వెరీ హార్డ్ వర్కర్. తన ఫన్ తో ఈ సినిమా చేశాం. చాలా చోట్ల తిరిగాం. చాలా మస్తీ చేశాం. తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. సినిమాని చాలా ఎంజాయ్ చేస్తారు. అందరికీ థాంక్ యూ' అన్నారు. ఉస్తాద్ రామ్ పోతినేని మాట్లాడుతూ.. నార్త్ ఆడియన్స్ సౌత్ ఫిలిమ్స్ ని ఇష్టంగా చూస్తారు. నేరుగా హిందీలో రిలీజ్ చేయమని కోరుతుంటారు. డబుల్ ఇస్మార్ట్ తో నార్త్ ఆడియన్స్ ముందుకు రావడం ఆనందంగా వుంది. సినిమాని దాదాపు ముంబైలో షూట్ చేశాం. డబుల్ ఇస్మార్ట్ మ్యాడ్నెస్ ఇక్కడ కూడా విట్నెస్ చేస్తారని ఆశిస్తున్నాను. డబుల్ ఇస్మార్ట్ మెంటల్ మాస్ మ్యాడ్ నెస్ క్యారెక్టర్. ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. పూరి గారి నా కోసం ఈ క్యారెక్టర్ రాయడం ఆనందంగా వుంది. ఈ క్యారెక్టర్ ని చాలా ఎంజాయ్ చేస్తూ ప్లే చేశాను. ఇస్మార్ట్ శంకర్ ని ఆడియన్స్ హ్యూజ్ హిట్ చేశారు.

# తమిళ సినిమాలకు.. జీవం పోస్తున్న మలయాళ భామలు



మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు యువ హీరోయిన్లు తమిళ చిత్రాల్లో నటించేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. హీరో, దర్శకుడు, ఇలా ఏ ఒక్క అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, స్టోరీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు యువ హీరోయిన్లు తమిళ చిత్రాల్లో నటించేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. హీరో, దర్శకుడు, నిర్మాత, నిర్మాణ సంస్థ, ఆ సినిమాలో నటించే సహ నటీనటులు ఎవరు? ఇలా ఏ ఒక్క అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, స్టోరీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఆ పాత్ర చిన్నదా? పెద్దదా? అనే విషయాన్ని కూడా వారు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో నిఖిలా విమల్, అన్నా బెన్, రజీషా విజయన్, పార్వతి తిరువోతులను ప్రధానంగా చెప్పుకోవచ్చు. 'వాళై' చిత్రంలో నటించిన నిఖిల, 'కొట్టుకాలి' మూవీలో నటించిన అన్నా బెన్, తంగలాన్ సినిమాతో పార్వతి అచ్చం గ్రామీణ మహిళలుగా మారి తమ నటనతో ప్రాణం పోస్తున్నారు. ఈ సినిమాలు విడుదలైన తర్వాత ఈ ముగ్గురు యువ హీరోయిన్లు తమ పాత్రల్లో జీవించారంటూ ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తారని ఆయా చిత్ర యూనిట్ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా తమిళ చిత్రపరిశ్రమలో ఇతర భాషలకు చెందిన హీరోయిన్లు ఆధిపత్యం చెలాయిస్తుంటారు. కోలీవుడ్ దర్శకులు సైతం అందానికి ప్రాధాన్యత ఇవ్వకుండా నటీనటుల ప్రతిభకు పెద్దపీట వేసి హీరోయిన్లను ఎంపిక చేస్తుంటారు. ఆ కోవలోనే మాలీవుడ్‌కు చెందిన యువ కథానాయికలకు దర్శకులు అవకాశాలు ఇస్తున్నారనే టాక్ వినిపిస్తుంది. అలా వచ్చిన అవకాశాన్ని కూడా ఈ యువ హీరోయిన్లు సద్వినియోగం చేసుకుంటూ సినీ రంగంలో స్థిరపడిపోతున్నారు.

# ఖాకీ పాత్రల్లో కథానాయికలు

వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే.. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే... ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

లేడీ సింగం

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీసగా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

మర్డర్ మిస్టరీని ఛేధించే పాత్రలో

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'ఆంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.

శత్రు సంహారానికై.

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్డే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

వెబ్ సిరీసలోనూ

వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీసలో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమ్రిత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రెండో సీజన్ వచ్చేస్తోంది

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహుమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.

పవర్‌ఫుల్ పాత్రలో

'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్ర. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీసలో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.

# డీసెంట్ లుక్ లో కూల్ గా కపూర్ బ్యూటీ!



బాలీవుడ్ బ్యూటీ వాణీకపూర్ ఇన్ స్టాని హీటెక్కించడంలో తనదైన మార్క్ వేస్తుంది. ఎప్పటికప్పుడు సొగసైన ఫోటోలతో మంటలు రేపడం సొగసరి ప్రత్యేకత. ఆల్ట్రా మోడ్రన్ దుస్తుల్లోనూ అగ్గిరాజేస్తుంది. మార్కెట్ లో న్యూ ట్రెండ్స్ ని పరిచయం చేయడంలోనూ ముందుంటుంది. సినిమాల కన్నా అధిక ఆదాయాన్ని ఇన్ స్టా ద్వారానే సంపాదిస్తుంది. భామలందరకి కంటే వాణీ కపూర్ ఆ లిస్ట్ లో ముందు వరుసలో ఉ ందంటే? అతిశయోక్తి కాదు. ఎప్పటికప్పుడు వాణీలో వేడిని ఆవిష్కరిస్తూ ఇన్ స్టా ఫాలోవర్స్ ని అంతకంతకు రెట్టింపు చేసుకుంటుంది. దీంతో ఆదాయం అంతే పెరుగుతుంది. తాజాగా అమ్మడు మరో ఫోటోతో నెటి జనుల ముందుకొచ్చే సింది. ఇదిగో ఇక్కడిలా వాణీ డీసెంట్ లో లుక్ కూల్ గా కనిపిస్తుంది. పువ్వుల సారీపై నలుపురు రంగు రవి ధరించి ఆకర్షణీయంగా ముస్తాబైంది. నెక్ ని క్లీన్ గా ఉంచుతూ...చెవులకు అందమైన దిద్దులతో అలంకరించింది. సారీ ని మ్యాచ్ చేస్తూ పర్ఫెక్ట్ మ్యాకప్ తో లుక్ ఎంతో బ్యాలెన్సింగ్ గా ఉంది. వాణీ అంటే హైట్...కలర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కెమెరాకి ఎలాంటి భంగిమల్లో ఫోజులిచ్చినా? కెమెరా కన్ను వాటిని పట్టుకోకపోయినా? వాణీ ఐస్ మాత్రం సంథింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంటాయి. కపూర్ బ్యూటీ మంచి హైట్ కావడంతో కెమెరా యాంగిల్స్ కి ఎంతో కంపర్ట్ బుల్ గా ఉంటుంది. అడవిలో పుష్ప రాజ్ రొమాంటిక్ డోస్ ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. కపూర్ బ్యూటీని అభిమానులు ఇలా చూసి చాలా రోజు లవుతుంది. దీంతో అమ్మడిపై అభిమానమంతా కామెంట్ల రూపంలోతెలియజేస్తున్నారు. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే గత ఏడాది ఖాళీగానే ఉంది. ఈ ఏడాది మాత్రం ఖేల్ ఖేల్ మే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతుంది. అలాగే మరో చిత్రం రెయిడ్ -2 షూటింగ్ కూడా పూర్తి చేసింది. మరో సినిమా ఆన్ సెట్స్ లో ఉంది.

# భక్తుల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శనము క్యూ లైన్ ను పర్యవేక్షించిన ఆలయ ఈఓ కె.వినోద్ రెడ్డి



వేములవాడ ఆగస్టు 12 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : శ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను పరిశీలించారు, ఆలయ ఆవరణ లో ఏర్పాటు చేసిన బ్రేక్ దర్శనం క్యూలైన్లను పరిశీలించారు ఈ నేపథ్యంలో ఆలయ రిషిప్షన్ ఏఈఓ రమేష్ బాబు మరియు ప్రోటోకాల్ పర్యవేక్షకులు రాజన్ బాబులకు క్యూ లైన్ లలో భక్తులకు ఎలాటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచనలు చేశారు. వీరి వెంట ఆలయ సిబ్బంది తో పాటుగా ఎస్పీఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



రాజన్న సిరిసిల్ల, ఆగస్టు -12 : జిల్లాలో నిర్వహించు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో వివిధ శాఖల ద్వారా స్టాళ్ల ప్రదర్శన చేపట్టాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించాలని అన్నారు. దేశ భక్తి గేయాలతో కూడిన నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాల క్రింద ఏర్పాటు చేయాలని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ వీలుగా జూనియర్ కళాశాల మైదానాన్ని పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలని కలెక్టర్ సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్దం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు ఆగస్టు 14 లోపు పంపాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్య అతిథి సందేశం అందించేందుకు వీలుగా స్పీచ్ కాపీ రూపకల్పనకు ప్రతి శాఖ క్లుప్తంగా నివేదికలను డి.పి.ఆర్.ఓ కు అందజేయాలని అన్నారు. స్వాతంత్ర్య వేడుకల వేదిక , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు స్వాతంత్ర్య సమర యోధులను ఆహ్వానించాలని అన్నారు. జిల్లాలో నేత కార్మికులు , ప్రాముఖ్యమైన వ్యక్తులు వేడుకలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖ వారి కార్యాలయంలో వేడుకల నిర్వహించి, జిల్లాలో జరిగే వేడుకలకు హాజరు కావాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఏఎన్ఏం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు.స్వాతంత్ర్య వేడుకల అవసరమైన మేర త్రాగు నీటి క్యాన్లు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ప్రాదాన్యత అంశాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా గ్రామపంచాయతీ ముసాయిదా ఓటర్ జాబితా రూపకల్పన : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఆగస్టు-12: జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటర్ జాబితా రూపకల్పన పై సంబంధిత అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశం ఉందని , దీనికి అవసరమైన ముసాయిదా ఓటర్ జాబితా గ్రామాల వారీగా రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల ఓటర్ జాబితా ప్రకారం గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్ జాబితా సవరణకు చర్యలు తీసుకోవాలని, 18 సంవత్సరాల నిండిన అర్హులైన నూతన ఓటర్లను నమోదు చేయాలని, గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ముసాయిదా ఓటర్ జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కృషి చేయాలని అన్నారు. గ్రామాలలో వన మహోత్సవం కింద నిర్దేశించిన మొక్కల లక్ష్యం పూర్తి చేయాలని, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశా లత, రజాక్ డి.పి. యం.ఈ పంచాయితీ,డివిజినల్ పంచాయతీ అధికారులు ఎంపీడీవోలు ,మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నెక్ట్స్ లిస్ట్ లో అనిల్

**అదిలాబాద్ :** కారు దిగేస్తున్న ఎమ్మెల్యేల సరసన చేరేందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తహతహ లాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బోథ్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన అనిల్ జాదవ్?. అధికార పార్టీ నేతలతో పోటీపడుతూ? ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారని.. గత కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా? తాజా ఎపిసోడ్‌తో ఆ ప్రచారం నిజమని నమ్మాల్సి వస్తోందంటున్నారు పరిశీలకులు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్యేల్లో నెక్ట్స్ అనిల్ జాదవ్ ఉన్నారనే ప్రచారం ఊపందుకుంది.డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క? గత బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం పరిధిలోని పిప్రి గామంలో పర్యటించారు. సరిగ్గా ఏడాదిన్నర క్రితం అంటే గతేడాది మార్చి 16న ఇదే గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ప్రారంభించారు భట్టి. సీఎల్పీ నేత హోదాలో నాడు పాదయాత్ర చేసిన భట్టి?. తమ పార్టీ అధికారంలోకి వస్తే పిప్రి గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీలను అమలు చేయడంలో భాగంగా గత బుధవారం పిప్రిలో పర్యటించారు భట్టి. ఐతే ఈ సభలో కాంగ్రెస్ నేతలతో పోటీపడుతూ మరీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్?. ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేలా మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదే ఇప్పుడు అనేక ఊహాగానాలకు తెరలేపింది.ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన డిప్యూటీ సీఎం భట్టి సభకు ఆదిలాబాద్ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలకు ఆహ్వానం పంపారు. వీరిలో ఇద్దరు బీఆర్ఎస్, ఒకరు బీజేపీ ఎమ్మెల్యే ఉండగా, మిగిలిన ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన వారు. ఐతే బీజేపీ ఎమ్మెల్యే పాయల్



శంకర్ హెలిపాడ్ వద్దే భట్టిని కలిసి వెళ్లిపోయారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసలు అటువైపే చూడలేదు. ఇక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎడ్మ బొజ్జు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ ఇద్దరిలో అనిల్ జాదవ్ హాజరే చర్చకు దారితీసింది. డిప్యూటీ సీఎం సభకు భారీ అనుచరగణంతో కలిసి వచ్చిన అనిల్ జాదవ్? డిప్యూటీ సీఎం ఆశీస్సులు ఉండాలనే స్థాయిలో పెర్ఫార్మెన్స్ చేయడమే పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌కు తెరలేపింది.డిప్యూటీ సీఎం భట్టి సభలో బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పీచ్ చూసి అంతా ఆశ్చర్యపోయారు. విపక్షానికి చెందిన ఎమ్మెల్యే డిప్యూటీ సిఎం భట్టిని తెగ పొగిడేయడం వెనుక రీజనేంటి? అనేది తెలుసుకోలేక స్థానిక బీఆర్ఎస్ నేతలతోపాటు కాంగ్రెస్ నేతలు జుట్టు పీక్కుంటున్నారు. కాంగ్రెస్ నేతలు సైతం ఆశ్చర్యపోయేలా అనిల్ జాదవ్ పొగడ్తలున్నాయంటున్నారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని కాసేపు మరచిపోయిన అనిల్ జాదవ్? తనలో ఇంకా కాంగ్రెస్ రక్తమే ప్రవహిస్తోందని సంకేతాలిచ్చారా? అనే చర్చ జరుగుతోంది. ఒకనానొక దశలో మన ప్రభుత్వం అంటూ అనిల్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి.

# సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ రిసోర్సెస్ పై అవగాహన సదస్సు




మేడ్చల్ జిల్లా:గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ లైబ్రరియన్స్ డే ను పురస్కరించుకొని సోమవారం రోజున ఈ రిసోర్సెస్ పై అవగాహన సదస్సు ను నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రతిష్ అయ్యర్, ట్రైనింగ్ మేనేజర్, జె గేట్ %ఽ% ఇన్ఫర్మాటిక్స్ హాజరయ్యారు. మీరు జర్నల్స్ ని ఎలా వెబ్ సైట్ లో చూడచవచ్చు, వాటిని మనకు అనుకూలంగా ఎలా ఉపయోగించుకోవచ్చు అనే విషయాన్ని క్షుణ్ణంగా వివారించారు. జర్నల్స్ లో వివిధ రకాల కేటగిరిల్లో గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీలత మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో కూడిన డిజిటల్ లైబ్రరీ మన కాలేజీలో అందుబాటులో ఉందని, దాన్ని చక్కగా వినియోగించుకొని పరిశోధనాత్మక పత్రాలను సమర్పించుకోవడానికి చాలా అనుకూలంగా ఉన్నాయని, అందుకు జె గేట్ లాంటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. లైబ్రరియన్ డాక్టర్ ఎన్ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీ ఎస్సార్ రంగనాథన్ లైబ్రరీ డిపార్ట్మెంట్ కు చేసిన ఎనలేని సేవలు కొనియాడారు. అందుకుగాను ఈయన పుట్టినరోజును నేషనల్ లైబ్రేరియన్స్ డే గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీలత, ముఖ్య అతిథి రతిష్ అయ్యర్, క్రిష్ణ కిషోర్, అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, లైబ్రేరియన్ డాక్టర్ ఎన్ రవిశంకర్ రెడ్డి, పిఆర్వో రవి సుధాకర్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి.. ... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, ఆగస్టు -12: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ , జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొని ప్రజల అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన వి.తిరుపతమ్మ తన భర్త ఫిబ్రవరి 10, 2022న మరణించారని, తనకు వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గోదావరిఖని పట్టణం విటల్ నగర్ కు చెందిన ఎండి.రిహాజుద్దిన్ స్వయం ఉపాధి యూనిట్ ఏర్పాటు కోసం ఏదైనా రుణ సదుపాయం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా లీడ్ బ్యాంక్ మేనేజర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి మండలం చీకురాయి గ్రామానికి చెందిన ఎం. లక్ష్మీ ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఏప్రిల్ 19, 2024న ప్రమాదవశాత్తు విషపూరితమైన పాము కుట్టడం జరిగిందని, వైద్య ఖర్చుల నిమిత్తం ఖర్చు చేసిన ఖర్చులను ఉపాధి హామీ కింద మంజూరు చేయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మంథని మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన నగావత్ రుకమ్మ తమ ఇల్లు, పోలం ఓపెన్ కాస్ట్ మైనింగ్ విస్తీర్ణంలో సింగరేణి ప్రాజెక్టు కింద స్వాధీనం చేసుకున్నారని, మాకు ప్రకటించిన ఆర్ ఆర్ ప్యాకేజీ లో తన పేరు తన కుమారుని పేరు రాలేదని, తనకు తన కుమారుడికి సైతం ఆర్ ప్యాకేజీ వచ్చేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మంథని ఆర్డిఓ కు రాస్తూ పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు పెట్టుబడు లు రప్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ఆగస్టు 12 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : విదేశీ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి బిజిబిజీగా ఉన్నారు. తెలంగాణకు పెట్టుబడు లు రప్పించడమే లక్ష్యంగా ఆయన టూర్ కొనసాగుతోంది. అమెరికా టూర్ ముగించుకున్న నేరుగా దక్షిణకొరియాకు వెళ్లారు. దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో పర్యటిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. సోమవారం ఉదయం ఎల్‌జీ గ్రూప్ అనుబంధమైన సంస్థ ఎల్ఎస్ ఛైర్మన్ కూ జా యున్‌తో భేటీ అయ్యారు. తెలంగాణలో అభివృద్ధిని వర్ణిస్తూ నే, త్వరలో కొత్త సిటీని నిర్మాణం చేయనున్నట్లు వెల్లడించారు. ఆ సిటీ.. రకరకాల పరిశ్రమలకు కేరాఫ్‌గా మారుతుందని వివరించారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుల్స్, గ్యాస్ %-% ఎనర్జీ, బ్యాటరీల తయారీ తదితర అంశాలపై ఆ కంపెనీ ప్రతినిధు లతో చర్చించారు సీఎం రేవంత్‌రెడ్డి. సానుకూలంగా స్పందించిన ఆ కంపెనీ, త్వరలో ఎల్ఎస్ బృందం తెలంగాణలో పర్యటన వస్తామని తెలిపింది

# కేటీఆర్ అన్ని బోకర్ ఒప్పందాలు

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో 3500 మందికి ఉద్యోగాలు



ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వేములవాడ ఆగస్టు 12 తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల పేరుతో కేటీఆర్ గత ప్రభుత్వ ఫేక్ ఒప్పందాలు చేసుకున్నారని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ విమర్శించారు సారు బూటు సూటు వేసుకొని దావోస్ వెళ్లిన కేటీఆర్ ఎన్ని కంపెనీలు తెచ్చారని ప్రశ్నించారు గత ఒప్పందాలు చేసుకున్న సంస్థలు సరైన మౌలిక వసతులు లేక ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని అన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం అమెరికా పర్యటన చేసి అనేక పెట్టుబడి చేస్తున్నారని తెలిపారు కొత్తగా పెట్టుబడి రావడంతో రాష్ట్రంలో 30,500 ఉద్యోగాలు రాబోవు రాబోతున్నాయని ఆయన తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి పెట్టుబడులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో కాకుండా అనేక ఉద్యోగ అవకాశాలు కూడా వివిధ కంపెనీల ప్రసిద్ధులతో మాట్లాడి కొత్త కంపెనీలు రావడానికి కుట్టేశారన్నారు గత ఎనిమిది నెలల కాలంలో రాష్ట్రానికి 60 వేల కోట్ల రూపాయలను పెట్టుబడును తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దేనని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు

# ఫోన్ మాట్లాడుతూ నీటిలో పెట్టాల్సిన హీటర్ చంకలో పెట్టుకున్న వ్యక్తి.. షాక్ కొట్టి మృతి చెందిన మహేష్ బాబు



హైదరాబాద్/ ఖమ్మం ఆగస్టు 12, తెలంగాణ నుండి ఫోకస్ ప్రతినిధి : ఖమ్మం – స్థానిక కాల్వ ఒడ్డునున్న హనుమాన్ గుడి సమీపంలో దోనెపూడి మహేశ్ బాబు (40) ఆదివారం రాత్రి ఆయన ఇంట్లో పెంపుడు కుక్కకు స్నానం చేయించేందుకు వేడినీళ్ల కోసం హీటర్ ఆన్ చేయబోయారు. ఈలోగా ఫోన్ రావడంతో మాట్లాడుతూ.. హీటర్‌ను నీటిలో బదులు చంకలో పెట్టుకుని స్విచ్ ఆన్ చేశారు. దీంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. దీంతో అప్రమత్తమైన భార్య దుర్గాదేవి మహేశ్ బాబును ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.